TG TEL/25/A1234 www.kakatiyanews.com

ఉత్తరం

# కాకతీయ

బుధవారం 05 ఆగస్టు, 2026 | సంపుటి - 01 సంచిక - 357 | పేజీలు - 6 + 6 వెల - 5


## కేరళకు భరోసా..!

- వరద బాధితులకు భారీ ఆర్థిక ప్యాకేజీ ప్రకటించిన పినరయి ప్రభుత్వం
- మృతుల కుటుంబాలకు రూ.8 లక్షల ఎక్స్‌గ్రేషియా
- ఇళ్లు, భూములు కోల్పోయిన వారికి పెరిగిన పరిహారం
- సహాయక చర్యల్లో హెలికాప్టర్లు, మత్స్యకార బోట్లు
- సోషల్ మీడియా పుకార్లను నమ్మొద్దని సీఎం విజ్ఞప్తి

3లో






## కర్ణాటకలో సెగ...తెలంగాణలో బ్రేక్..!

- డీకే కేబినెట్‌లో మంత్రి పదవులపై రగడ
- కర్ణాటకలో పెరుగుతున్న అసమ్మతితో హైకమాండ్ అలర్ట్
- తెలంగాణలో మంత్రివర్గ విస్తరణపై హైకమాండ్‌కు హెచ్చరిక
- మంత్రి పదవుల కోసం రాష్ట్ర ప్రభుత్వంలో పోటీ పీక్స్‌కు
- విదేశీ పర్యటన, అసెంబ్లీ సమావేశాలతో మరింత జాప్యం
- విస్తరణ కంటే పార్టీ సమతుల్యతకే హైకమాండ్ ప్రాధాన్యం

కాకతీయ, తెలంగాణ బ్యూరో : కర్ణాటక కాంగ్రెస్‌లో మంత్రివర్గ విస్తరణ చుట్టూ చెలరేగిన రాజకీయ దుమారం... తెలంగాణ కాంగ్రెస్‌పై కూడా ప్రభావం చూపుతున్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అక్కడ మంత్రి పదవులు దక్కని సీనియర్ ఎమ్మెల్యేల బహిరంగ అసమ్మతి, రాజీనామా హెచ్చరికలు, అధిష్ఠానం జోక్యం వంటి పరిణామాలు ఢిల్లీలో కాంగ్రెస్ పెద్దలను అప్రమత్తం చేశాయి. ఇదే సమయంలో తెలంగాణలో కూడా కేబినెట్ విస్తరణపై నెలలుగా చర్చ జరుగుతున్నా... నిర్ణయం మాత్రం ముందుకు సాగకపోవడానికి కర్ణాటక పరిణామాలు కూడా ఒక కారణంగా మారినట్లు పార్టీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఒకేసారి విస్తరణ, శాఖల మార్పులు చేపడితే ఇక్కడ కూడా అసమ్మతి చెలరేగే అవకాశం ఉందనే అంచనాతో హైకమాండ్ అత్యంత జాగ్రత్తగా అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది.

... తరువాయి 2లో

# హిల్ట్.. హైప్ ఎంత?
# హిట్ అవుతుందా..?

- పారిశ్రామిక తెలంగాణకు కొత్త బ్రాండ్ అవుతుందా?
- కాంగ్రెస్ ప్రభుత్వానికి రాజకీయంగా ప్లస్సా...మైనస్సా?
- పెట్టుబడిదారుల నమ్మకాన్ని నిలబెట్టే తొలి పరీక్ష
- విపక్షాల విమర్శల మధ్య సాఫీగా అమలే అసలు సవాల్
- భూమి కేటాయింపుల నుంచి ఉద్యోగాల వరకూ కఠిన నిఘా అవసరం
- హిల్ట్ విజయమే ప్రభుత్వ పారిశ్రామిక విధానానికి లిట్మస్ టెస్ట్




కాకతీయ, తెలంగాణ బ్యూరో : తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్ ట్రాన్స్‌పరెన్సీ (హిల్ట్) విధానం ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లోనూ, పారిశ్రామిక వర్గాల్లోనూ ప్రధాన చర్చగా మారింది. పారిశ్రామిక భూముల కేటాయింపులో పారదర్శకత తీసుకురావడమే లక్ష్యంగా రూపొందించిన ఈ విధానాన్ని ప్రభుత్వం సంస్కరణగా ప్రచారం చేస్తుండగా... అమలులో ఎదురయ్యే సవాళ్లపై విపక్షాలు ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. ఒకవైపు పెట్టుబడిదారులకు సింగిల్ విండో తరహాలో భూమి కేటాయింపులు, మరోవైపు వేల ఎకరాల ప్రభుత్వ భూముల వినియోగంపై రాజకీయ విమర్శలు... ఈ రెండింటి మధ్య హిల్ట్ తొలి అడుగులు వేస్తోంది. ఈ విధానం విజయవంతమైతే కాంగ్రెస్ ప్రభుత్వానికి పారిశ్రామిక రంగంలో పెద్ద మైలురాయిగా నిలిచే అవకాశం ఉండగా... అమలులో చిన్న పొరపాటు జరిగినా అదే ప్రతిపక్షాలకు ప్రధాన అస్త్రంగా మారే పరిస్థితి కనిపిస్తోంది.

... తరువాయి 2లో



## ట్యాపింగ్ కేసులో కొత్త ట్విస్ట్..!

- సప్లిమెంటరీ ఛార్జిషీట్‌లో రాజకీయ ప్రకంపనలు..?
- 15లోగా అదనపు ఛార్జిషీట్ దాఖలుకు సిట్ కసరత్తు
- 600 మంది వాంగ్మూలాలు.. డిజిటల్ ఆధారాలతో దర్యాప్తు చివరి దశకు
- ముగ్గురు రాజకీయ నేతల పేర్లపై న్యాయ నిపుణులతో సంప్రదింపులు
- ప్రభాకర్‌రావు నుంచి రాజకీయ నాయకుల వరకూ విస్తరించిన విచారణ
- ట్యాపింగ్ కేసు మళ్లీ తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారే సూచనలు
- చట్టపరంగా పటిష్టమైన అభియోగాలపైనే సిట్ దృష్టి

కాకతీయ, తెలంగాణ బ్యూరో : తెలంగాణ రాజకీయాలను కుదిపేసిన ఫోన్ ట్యాపింగ్ కేసు మరో కీలక మలుపు తిరిగే దశకు చేరుకుంది. ఇప్పటికే మాజీ ఎస్ఐబీ చీఫ్ టి. ప్రభాకర్‌రావుతో పాటు పలువురు మాజీ పోలీసు అధికారులపై నమోదైన కేసులో దర్యాప్తును ముమ్మరం చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)...

... తరువాయి 2లో

## ప్రైవేట్ నెట్‌కు గుడ్‌బై..!

- సెప్టెంబర్ 1 నుంచి ప్రభుత్వ కార్యాలయాలకు టీ-ఫైబర్ తప్పనిసరి
- ప్రైవేట్ ఇంటర్నెట్ బిల్లులకు చెక్ చెప్పిన ప్రభుత్వం
- టీ-స్వాన్‌ను నెలరోజుల్లో టీ-ఫైబర్‌లో విలీనం చేయాలని ఆదేశం
- ఫ్యూచర్ సిటీకి వరల్డ్‌క్లాస్ డిజిటల్ కనెక్టివిటీపై ఫోకస్




కాకతీయ, తెలంగాణ బ్యూరో : తెలంగాణలో ప్రభుత్వ డిజిటల్ నెట్‌వర్క్‌ను పూర్తిగా టీ-ఫైబర్ ఆధారిత వ్యవస్థగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సెప్టెంబర్ 1 నుంచి రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు కేవలం టీ-ఫైబర్ ద్వారానే ఇంటర్నెట్ సేవలు అందించాలని సమాచార సాంకేతిక, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అధికారులను ఆదేశించారు.

... తరువాయి 2లో



## తమిళనాడులో రాజకీయ తుఫాన్

- ఉదయనిధి అరెస్టుపై భగ్గుమన్న డీఎంకే
- విజయ్ ప్రభుత్వంపై స్టాలిన్ తీవ్ర విమర్శలు
- బడ్జెట్ సమావేశాలకే దూరం చేయాలనే కుట్ర అంటూ ఆరోపణలు

2లో




## మెటాకు కేంద్రం మరో సమన్లు

- ఢిల్లీలో విచారణకు హాజరుకావాలని గ్లోబల్ బృందానికి ఆదేశం
- ప్రధాని పోస్టు తొలగింపుపై కేంద్రం ఆగ్రహం
- సాంకేతిక లోపం పేరుతో తప్పించుకోలేరన్న ఐటీ శాఖ

2లో

## కల్తీ మసాలాలపై హెచ్-ఫాస్ట్ ఉక్కుపాదం

- హైదరాబాద్‌లో 13 కేంద్రాలపై మెరుపు దాడులు
- 25.3 టన్నుల కల్తీ మసాలాలు, 89.15 టన్నుల ముడిపదార్థాల స్వాధీనం
- ముగ్గురు అరెస్టు.. మూడు క్రిమినల్ కేసుల నమోదు
- సింథటిక్ రంగులు, క్లాత్ డైలు, టాల్కమ్ పౌడర్ వినియోగం వెలుగులోకి

3లో





దేశానికే ఆదర్శంగా యంగ్ ఇండియా

## పోలీస్ స్కూల్

- నిర్మాణ పనులు వేగవంతం చేయాలని డీజీపీ సీవీ ఆనంద్ ఆదేశం
- విలువలతో కూడిన విద్యకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచన
- బాధ్యతాయుత పౌరులుగా విద్యార్థులను తీర్చిదిద్దడమే లక్ష్యం

2లో



## మిషన్-31కు బీజేపీ మాస్టర్ ప్లాన్!

- రాష్ట్రవ్యాప్తంగా పోరాటాలకు కాషాయ పార్టీ సిద్ధం
- కాంగ్రెస్ వైఫల్యాలే ప్రధాన అస్త్రంగా ముందుకు
- సామాజిక సమీకరణలతో కొత్త రాజకీయ వ్యూహం
- అధికారమే లక్ష్యంగా కేడర్‌కు దిశానిర్దేశం

3లో




## ప్రజల వద్దకే ప్రజావాణి..!

- మండల స్థాయిలో ప్రతి సోమవారం ఫిర్యాదుల స్వీకరణ
- ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహణ
- ఆన్‌లైన్‌లోనూ ఫిర్యాదుల కోసం ప్రత్యేక పోర్టల్
- ఎంపీడీవోకు నోడల్ అధికారిగా బాధ్యతలు
- ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కొత్త నిర్ణయం

కాకతీయ, తెలంగాణ బ్యూరో : ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత చేరువయ్యేలా తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. జిల్లా కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా మండల స్థాయిలోనే ప్రజల ఫిర్యాదులను స్వీకరించి పరిష్కరించేలా 'మండల ప్రజావాణి' కార్యక్రమాన్ని ప్రారంభించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు మండల కేంద్రాల్లో ప్రజావాణి నిర్వహించాలని అన్ని జిల్లాల అధికారులను ఆదేశించింది. ప్రజావాణి నిర్వహణకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలను జారీ చేసింది. మండల స్థాయిలో స్వీకరించిన ప్రతి వినతిని నమోదు చేసి, సంబంధిత శాఖలకు పంపించి నిర్దిష్ట గడువులో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొంది. ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకురావడానికి ఈ వేదిక ఉపయోగపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

### ఆన్‌లైన్‌లోనూ ఫిర్యాదుల స్వీకరణ

ప్రజావాణిని మరింత పారదర్శకంగా, సాంకేతికంగా నిర్వహించేందుకు ప్రత్యేక ఆన్‌లైన్ పోర్టల్‌ను కూడా రూపొందించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

... తరువాయి 2లో

ఉత్తరం
కాకతీయ

బుధవారం 05 ఆగష్టు, 2026


# హిల్ట్.. హైప్ ఎంత? హిట్ అవుతుందా..?

(మొదటి పేజీ తరువాయి)

### పెట్టుబడులకు వేగం... ప్రభుత్వ లక్ష్యం

హిల్ట్ ద్వారా పారిశ్రామిక అవసరాల కోసం భూమి కేటాయింపు ప్రక్రియను పూర్తిగా డిజిటల్ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. వివిధ ప్రాంతాల్లో అందుబాటులో ఉన్న ప్రభుత్వ పారిశ్రామిక భూముల వివరాలను ఒకే వేదికపై అందుబాటులో ఉంచి, పెట్టుబడిదారులు తమ అవసరాలకు అనుగుణంగా ఎంపిక చేసుకునే అవకాశం కల్పిస్తోంది. తొలి దశలో వందలాది పారిశ్రామిక ప్లాట్లు, వేల ఎకరాల భూమిని ఈ వ్యవస్థలో చేర్చినట్లు ప్రభుత్వం ప్రకటించింది. దరఖాస్తు నుంచి కేటాయింపు వరకు మానవ జోక్యం తగ్గించి, సమయపాలనతో నిర్ణయాలు తీసుకోవడం ద్వారా పెట్టుబడుల ప్రవాహాన్ని పెంచాలన్నదే ప్రభుత్వ లక్ష్యంగా కనిపిస్తోంది. ఇటీవల పెట్టుబడుల కోసం రాష్ట్రాల మధ్య పోటీ తీవ్రంగా పెరిగిన నేపథ్యంలో, తెలంగాణ కూడా కొత్త విధానాలతో పరిశ్రమలను ఆకర్షించేందుకు ప్రయత్నిస్తోంది. గతంలో టీఎస్–ఐపాస్ ద్వారా అనుమతుల ప్రక్రియను వేగవంతం చేసినట్లే.. భూమి కేటాయింపులోనూ సంస్కరణలు తీసుకురావాలని కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తోంది.

### ప్రభుత్వానికి రాజకీయంగా ప్లస్సా... మైనస్సా?

హిల్ట్ విజయవంతమైతే కాంగ్రెస్ ప్రభుత్వం పరిశ్రమల అభివృద్ధిపై స్పష్టమైన ముద్ర వేసే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. పెట్టుబడులు పెరగడం, కొత్త పరిశ్రమలు రావడం, ఉద్యోగాల కల్పన జరిగితే అది ప్రభుత్వానికి రాజకీయంగా పెద్ద ప్లస్‌గా మారుతుంది. ముఖ్యంగా యువత ఉపాధి అంశాన్ని ప్రభుత్వం బలంగా ప్రస్తావిస్తున్న తరుణంలో హిల్ట్ ఫలితాలు కీలకంగా మారనున్నాయి. అయితే మరోవైపు భూముల కేటాయింపులో పారదర్శకతపై ఏ చిన్న సందేహం వచ్చినా పరిస్థితి పూర్తిగా మారే అవకాశం ఉంది. గతంలో పారిశ్రామిక భూముల కేటాయింపులపై వచ్చిన ఆరోపణలను ప్రతిపక్షాలు ఇప్పటికీ ప్రస్తావిస్తూనే ఉన్నాయి. ఇప్పుడు కొత్త విధానంలోనూ వివాదాలు తలెత్తితే ప్రభుత్వం తీవ్ర రాజకీయ ఒత్తిడిని ఎదుర్కోవాల్సి రావచ్చు.

### పారిశ్రామిక వర్గాల స్పందన ఎలా ఉంది?

పారిశ్రామిక వర్గాల్లో మాత్రం ఈ విధానంపై జాగ్రత్తపూర్వక ఆశావాదం కనిపిస్తోంది. భూమి ఎంపిక, దరఖాస్తు, అనుమతుల ప్రక్రియ ఒకే వేదికపై జరిగితే సమయం ఆదా అవుతుందని పరిశ్రమల ప్రతినిధులు భావిస్తున్నారు. ముఖ్యంగా మధ్య తరహా, చిన్న పరిశ్రమలకు ఇది ఉపయోగపడే అవకాశముందని అభిప్రాయపడుతున్నారు. అయితే కేవలం ఆన్‌లైన్ పోర్టల్ ఏర్పాటు చేయడమే సరిపోదని... భూములపై చట్టపరమైన వివాదాలు లేకుండా, మౌలిక వసతులు సిద్ధంగా ఉండేలా చూడాలని సూచిస్తున్నారు. విద్యుత్, నీరు, రహదారులు, కాలుష్య అనుమతులు వంటి అంశాలు కూడా సమాంతరంగా పరిష్కారమైతేనే ఈ విధానం ఆశించిన ఫలితాలు ఇస్తుందని పరిశ్రమల వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

### విపక్షాల ప్రశ్నలు... అమలే అసలు పరీక్ష

హిల్ట్ ప్రకటించిన వెంటనే ప్రతిపక్షాలు అప్రమత్తమయ్యాయి. ప్రభుత్వ భూముల కేటాయింపులో పారదర్శకత నిజంగా ఉంటుందా? లబ్ధిదారుల ఎంపిక ఎలా జరుగుతుంది? పెద్ద సంస్థలకే ప్రాధాన్యం ఇస్తారా? స్థానిక పారిశ్రామికవేత్తలకు అవకాశాలు దక్కుతాయా? అనే ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. అదేవిధంగా భూములు తీసుకున్న సంస్థలు నిజంగానే పరిశ్రమలు స్థాపిస్తాయా? లేక భూములను నిల్వ చేసుకుని రియల్ ఎస్టేట్ లాభాలకే వినియోగిస్తాయా? అన్న అంశంపై కూడా ప్రతిపక్షాలు నిఘా పెట్టనున్నాయి. గతంలో కేటాయించిన భూముల్లో అనేక ప్రాజెక్టులు ప్రారంభం కాలేదన్న ఉదాహరణలను వారు ప్రస్తావిస్తున్నారు. ప్రభుత్వం హిల్ట్‌ను కేవలం భూముల కేటాయింపు కార్యక్రమంగా కాకుండా ఉపాధి సృష్టి కార్యక్రమంగా చూపిస్తోంది. వేలాది ఉద్యోగాలు వస్తాయని చెబుతోంది. అయితే రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం... ఈ విధానం విజయాన్ని కొలిచేది కేటాయించిన ఎకరాల సంఖ్య కాదు, వచ్చిన పరిశ్రమల సంఖ్య కాదు, సృష్టించిన ఉద్యోగాలే. భూములు కేటాయించి ప్రాజెక్టులు ఆలస్యం అయితే ప్రభుత్వం చెప్పే అభివృద్ధి కథనం బలహీనపడే అవకాశం ఉంది. అదే నిర్ణీత గడువులో పరిశ్రమలు ఏర్పడి స్థానిక యువతకు ఉపాధి కల్పిస్తే హిల్ట్ నిజమైన సంస్కరణగా నిలుస్తుంది.

### హిల్ట్... సంస్కరణా? రాజకీయ రిస్కా?

తెలంగాణలో పారిశ్రామిక విధానానికి కొత్త దిశగా ప్రభుత్వం హిల్ట్‌ను తీసుకొచ్చినప్పటికీ, దాని భవిష్యత్తును నిర్ణయించేది అమలే. పారదర్శకత, వేగం, చట్టబద్ధత, ఉపాధి... ఈ నాలుగు అంశాల్లో ప్రభుత్వం విజయవంతమైతే హిల్ట్ కాంగ్రెస్ ప్రభుత్వానికి కీలక విజయగాథగా మారుతుంది. లేదంటే భూముల కేటాయింపులపై వచ్చే ప్రతి ఆరోపణ రాజకీయ వివాదంగా మారి ప్రభుత్వానికే భారమయ్యే ప్రమాదం ఉంది. అందుకే హిల్ట్ ఇప్పుడు కేవలం ఒక పారిశ్రామిక విధానం మాత్రమే కాదు... కాంగ్రెస్ ప్రభుత్వ పరిపాలనా సామర్థ్యానికి, పెట్టుబడిదారుల విశ్వాసానికి, ప్రతిపక్షాల విమర్శలకు సమాధానం చెప్పాల్సిన మొదటి పెద్ద రాజకీయ పరీక్షగా మారిందనే అభిప్రాయం అధికార, ప్రతిపక్ష వర్గాల్లో వ్యక్తమవుతోంది.

# ప్రైవేట్ నెట్‌కు గుడ్‌బై..!

**సెప్టెంబర్ 1నుంచి ప్రభుత్వ కార్యాలయాలకు టీ-ఫైబర్ తప్పనిసరి**
**ప్రైవేట్ ఇంటర్నెట్ బిల్లులకు చెక్ చెప్పిన ప్రభుత్వం**
**టీ-స్వాన్‌ను నెలరోజుల్లో టీ-ఫైబర్‌లో విలీనం చేయాలని ఆదేశం**
**ఫ్యూచర్ సిటీకి వరల్డ్‌క్లాస్ డిజిటల్ కనెక్టివిటీపై ఫోకస్**

అదే తేదీ నుంచి ప్రైవేట్ ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్లకు ఎలాంటి బిల్లులు ప్రాసెస్ చేయవద్దని, చెల్లింపులు నిలిపివేయాలని స్పష్టం చేశారు. తెలంగాణ సచివాలయంలో టీ–ఫైబర్ ప్రాజెక్టు పురోగతిపై నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో మంత్రి ఈ మేరకు కీలక ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ఐటీ శాఖ జాయింట్ సెక్రటరీ అనుదీప్ దురిశెట్టి, టీ–ఫైబర్ మేనేజింగ్ డైరెక్టర్ వేణు ప్రసాద్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. నిర్దేశిత గడువులోగా మౌలిక సదుపాయాలు, నెట్‌వర్క్ కనెక్టివిటీ పనులను పూర్తి చేసి ప్రతి ప్రభుత్వ కార్యాలయాన్ని టీ–ఫైబర్ పరిధిలోకి తీసుకురావాలని మంత్రి స్పష్టం చేశారు.

### టీ-స్వాన్ నుంచి టీ-ఫైబర్‌కు పూర్తి మార్పు

ప్రభుత్వ శాఖలకు ఎలాంటి అంతరాయం లేకుండా సేవలు కొనసాగేందుకు ప్రస్తుతం వినియోగంలో ఉన్న టీ–స్వాన్ (T–SWAN) నెట్‌వర్క్‌ను ఒక నెలలో పూర్తిగా టీ–ఫైబర్‌లో విలీనం చేయాలని మంత్రి శ్రీధర్‌బాబు ఆదేశించారు. అలాగే ప్రతిష్ఠాత్మక ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టుకు ప్రారంభం నుంచే ప్రపంచ స్థాయి డిజిటల్ మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. అత్యాధునిక, అధిక వేగం కలిగిన ఇంటర్నెట్ సేవలు అందుబాటులో ఉండేలా సమగ్ర కార్యాచరణ చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి నాణ్యమైన డిజిటల్ కనెక్టివిటీ అందించాలన్న లక్ష్యంతో అమలు చేస్తున్న 'ఇంటింటికీ ఇంటర్నెట్' కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేయాలని మంత్రి స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా గృహాలకు బ్రాడ్‌బ్యాండ్ సేవలను విస్తరించడం ద్వారా ప్రభుత్వ సంస్థలతో పాటు సాధారణ ప్రజలకు కూడా విశ్వసనీయమైన, సురక్షితమైన, సరసమైన ధరలో హైస్పీడ్ ఇంటర్నెట్ అందుబాటులోకి వస్తుందని తెలిపారు. డిజిటల్ తెలంగాణ నిర్మాణంలో టీ–ఫైబర్ కీలక పాత్ర పోషిస్తుందని, ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత వేగంగా, సమర్థవంతంగా అందించేందుకు ఈ నిర్ణయాలు ఉపయోగపడతాయని అధికారులు పేర్కొన్నారు.

# దేశానికే ఆదర్శంగా యంగ్ ఇండియా పోలీస్ స్కూల్

**నిర్మాణ పనులు వేగవంతం చేయాలని డీజీపీ సీవీ ఆనంద్ ఆదేశం**
**విలువలతో కూడిన విద్యకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచన**
**బాధ్యతాయుత పౌరులుగా విద్యార్థులను తీర్చిదిద్దడమే లక్ష్యం**

కాకతీయ, హైదరాబాద్ బ్యూరో : తెలంగాణ ప్రభుత్వం, పోలీసు శాఖ ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేస్తున్న యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ దేశానికే ఆదర్శ విద్యా సంస్థగా నిలవాలని రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ ఆకాంక్షించారు. మంచిరేవులలో నిర్మాణంలో ఉన్న పాఠశాల భవనాల పనులను నిర్ణీత గడువులో పూర్తి చేసి, అన్ని మౌలిక వసతులను కల్పించాలని అధికారులను ఆదేశించారు. మంగళవారం నిర్వహించిన స్కూల్ సొసైటీ కమిటీ సమావేశంలో ఐపీఎస్ అధికారుల సతీమణుల సంఘం అధ్యక్షురాలు లలితా ఆనంద్, కమిటీ సభ్యులతో కలిసి నిర్మాణ పురోగతి, విద్యా ప్రణాళికలు, మౌలిక సదుపాయాలపై సమీక్ష నిర్వహించారు. సమావేశానికి ముందు డీజీపీ సీవీ ఆనంద్ విద్యార్థులతో కలిసి ఫుట్‌బాల్ ఆడి వారిని ఉత్సాహపరిచారు. విలువిద్య, ఫెన్సింగ్ వంటి క్రీడల్లో విద్యార్థుల ప్రతిభను పరిశీలించి అభినందించారు. పోలీసు సిబ్బంది పిల్లలతో పాటు అమర పోలీసుల కుటుంబాల పిల్లలు, సాధారణ ప్రజల పిల్లలకు ప్రపంచ స్థాయి విద్య అందించాలనే లక్ష్యంతో ఈ విద్యాసంస్థను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు.

### విలువలతో కూడిన విద్యపై దృష్టి

పాఠ్యాంశాలతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు, దేశభక్తి, సేవాభావం, సామాజిక బాధ్యతలను పెంపొందించే విధంగా విద్యాబోధన ఉండాలని డీజీపీ సూచించారు. యువతను మాదకద్రవ్యాల వంటి సామాజిక దురాచారాలకు దూరంగా ఉంచేలా విలువల ఆధారిత విద్య అందించాలని పేర్కొన్నారు. సమాజానికి ఆదర్శ పౌరులను తీర్చిదిద్దే కేంద్రంగా యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ ఎదగాలని ఆకాంక్షించారు. సమీక్షలో పాఠశాల భవనాల నిర్మాణం, విద్యా విధానం, పాఠ్య ప్రణాళిక, మౌలిక సదుపాయాలపై విస్తృతంగా చర్చించారు. పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు, బిల్లులు, ఇతర ప్రతిపాదనలకు ఆమోదం తెలిపారు. సీనియర్ పోలీసు అధికారులు తరచూ పాఠశాలను సందర్శించి విద్యార్థులకు నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ, ప్రజాసేవపై మార్గనిర్దేశం చేయాలని సూచించారు. గత ఏడాది ప్రారంభమైన యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌లో ప్రస్తుతం 345 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నట్లు అధికారులు తెలిపారు. సమావేశంలో డీజీ మహేష్ భగవత్, డీజీ డాక్టర్ అనిల్ కుమార్, ఐజీ గజారావు భూపాల్, సైబరాబాద్ సీపీ రమేష్, ఐజీ ఉదయ్ కుమార్ రెడ్డి, డీసీపీ శ్రీనివాస్, ఫైనాన్స్ అడ్వైజర్ శరత్ కుమార్, ప్రిన్సిపాల్ అనిత, వ్యవస్థాపకుడు విశాల్ తదితరులు పాల్గొన్నారు.

# ట్యాపింగ్ కేసులో కొత్త ట్విస్ట్..!

(మొదటి పేజీ తరువాయి)

ఇప్పుడు సప్లిమెంటరీ ఛార్జిషీట్ దాఖలుకు సిద్ధమవుతోంది. ఈ నెల 15లోపు అదనపు ఛార్జిషీట్‌ను కోర్టులో సమర్పించాలనే లక్ష్యంతో అధికారులు కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. ముఖ్యంగా ఈసారి ఛార్జిషీట్‌లో రాజకీయ కోణానికి మరింత ప్రాధాన్యం లభించే అవకాశం ఉందన్న చర్చ రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తి రేకెత్తిస్తోంది. ముగ్గురు రాజకీయ నేతల పేర్లను చేర్చే అంశంపై సిట్ న్యాయ నిపుణులతో సంప్రదింపులు జరుపుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇప్పటివరకు ఈ కేసులో దాదాపు 600 మంది బాధితులు, సాక్షులు, అధికారులు, సంబంధిత వ్యక్తుల వాంగ్మూలాలను సిట్ నమోదు చేసినట్లు తెలుస్తోంది. ఈ వాంగ్మూలాలతో పాటు డిజిటల్ ఫోరెన్సిక్ ఆధారాలు, కాల్ డేటా విశ్లేషణ, టెలికాం సంస్థల నుంచి సేకరించిన రికార్డులు, ఇప్పటికే అరెస్టైన నిందితుల విచారణలో లభించిన వివరాలను సమగ్రంగా పరిశీలించి అదనపు ఛార్జిషీట్ రూపొందిస్తున్నట్లు సమాచారం. దర్యాప్తులో బయటపడిన ప్రతి అంశం కోర్టులో నిలబడేలా చట్టపరమైన అంశాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది.

### మొదటి ఛార్జిషీట్‌తో మొదలైన ప్రకంపనలు

2024లో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చినప్పటి నుంచి తెలంగాణ రాజకీయాల్లో ఫోన్ ట్యాపింగ్ కేసు తీవ్ర సంచలనం సృష్టించింది. తొలి ఛార్జిషీట్‌లో మాజీ స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో చీఫ్ టి. ప్రభాకర్‌రావు, అదనపు ఎస్పీ భుజంగరావు, డీఎస్పీ తిరుపతన్న, ఇన్‌స్పెక్టర్ గట్టు శ్రీనివాస్‌తో పాటు మరికొందరిపై అభియోగాలు నమోదు చేశారు. ప్రభుత్వ యంత్రాంగాన్ని దుర్వినియోగం చేసి రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలు, అధికారుల ఫోన్లను అక్రమంగా ట్యాప్ చేశారన్న ఆరోపణలతో దర్యాప్తు ప్రారంభమైంది. దర్యాప్తు ముందుకు సాగుతున్న కొద్దీ కేసు పరిధి విస్తరించింది. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ ఎంపీ జోగినిపల్లి సంతోష్‌కుమార్‌తో పాటు పలువురు రాజకీయ నాయకుల వాంగ్మూలాలను కూడా సిట్ నమోదు చేసింది. అదే సమయంలో టెలికాం సంస్థల నుంచి సేకరించిన సాంకేతిక ఆధారాలు, నిఘా వ్యవస్థ వినియోగానికి సంబంధించిన రికార్డులు కూడా దర్యాప్తులో కీలక ఆధారాలుగా మారాయి.

### రాజకీయ కోణంపైనే ఉత్కంఠ

సప్లిమెంటరీ ఛార్జిషీట్‌లో ముగ్గురు రాజకీయ నేతల పేర్లు ప్రస్తావనకు వచ్చే అవకాశముందన్న ప్రచారం రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది. అయితే కేవలం ప్రచారాన్ని ఆధారంగా చేసుకుని కాకుండా, కోర్టులో నిలిచే సాక్ష్యాధారాలు, చట్టపరమైన బలం ఉన్నప్పుడే పేర్లను చేర్చాలని సిట్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. అందుకే ప్రతి అంశంపై న్యాయ నిపుణుల అభిప్రాయాలు తీసుకుంటూ తుది నిర్ణయం తీసుకునే దిశగా అధికారులు అడుగులు వేస్తున్నారు. మొదటి ఛార్జిషీట్ తర్వాత నమోదైన కొత్త వాంగ్మూలాలు, సాంకేతిక ఆధారాలు, డిజిటల్ విశ్లేషణలతో ఈ కేసు దర్యాప్తు మరింత విస్తరించింది. ఇప్పుడు దాఖలయ్యే సప్లిమెంటరీ ఛార్జిషీట్‌లో కొత్త అభియోగాలు, కొత్త ఆధారాలు, అవసరమైతే మరికొందరి పాత్రపై కూడా స్పష్టత వచ్చే అవకాశముందని దర్యాప్తు వర్గాలు భావిస్తున్నాయి. దీంతో గత కొంతకాలంగా చర్చకు దూరమైన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం మరోసారి తెలంగాణ రాజకీయాల్లో ప్రధాన అజెండాగా మారే సూచనలు కనిపిస్తున్నాయి.

# తమిళనాడులో రాజకీయ తుఫాన్



- **ఉదయనిధి అరెస్టుపై భగ్గుమన్న డీఎంకే**
- **విజయ్ ప్రభుత్వంపై స్టాలిన్ తీవ్ర విమర్శలు**
- **బడ్జెట్ సమావేశాలకే దూరం చేయాలనే కుట్ర అంటూ ఆరోపణలు**
- **డీఎంకే-టీవీకే ఆందోళనలతో రాష్ట్రవ్యాప్తంగా ఉద్రిక్తత**

కాకతీయ, నేషనల్ డెస్క్ : నటి త్రిషను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలపై ప్రతిపక్ష నేత ఎం. ఉదయనిధి స్టాలిన్ అరెస్టు, అనంతరం బెయిల్‌పై విడుదల కావడం తమిళనాడు రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపింది. ఈ ఘటనను రాజకీయ కక్షసాధింపుగా అభివర్ణించిన డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్, ముఖ్యమంత్రి విజయ్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. అహంకారంతో వ్యవహరిస్తున్న ప్రభుత్వం ప్రతిపక్ష గొంతు నొక్కే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. స్టాలిన్ ఎక్స్ వేదికగా స్పందిస్తూ, శాసనసభలో ప్రతిపక్ష నేతగా ఉన్న ఉదయనిధిని ఇంటి వద్దే అరెస్టు చేసి తంజావూరుకు తరలించడం ప్రజాస్వామ్య విరుద్ధమని విమర్శించారు. తన కుమారుడు ఎవరి మనోభావాలను దెబ్బతీసే వ్యాఖ్యలు చేయలేదని, ఒకవేళ చేసినట్లు నిరూపితమైతే క్షమాపణ చెప్పేందుకు సిద్ధంగా ఉంటాడని పేర్కొన్నారు. బడ్జెట్ సమావేశాలకు ముందు అరెస్టు చేయడం వెనుక రాజకీయ ఉద్దేశమే ఉందని ఆరోపించారు.

### కావేరీ ఆందోళనలో మొదలైన వివాదం

కావేరీ జల వివాదంపై తంజావూరులో జరిగిన నిరసన కార్యక్రమంలో ప్రసంగిస్తున్న సమయంలో త్రిష పేరు ప్రస్తావన రావడంతో ఉదయనిధి చేసిన వ్యాఖ్యలపై వివాదం చెలరేగింది. ఆ వ్యాఖ్యలు ద్వంద్వార్థంగా ఉన్నాయని ఆరోపిస్తూ పోలీసులు కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. అయితే తన వ్యాఖ్యలను వక్రీకరించి ప్రచారం చేస్తున్నారని, అసలు వీడియోను ఎడిట్ చేసి తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఉదయనిధి ఖండించారు. విచారణ అనంతరం ఆయనను పోలీసులు విడుదల చేశారు. ఉదయనిధి అరెస్టును నిరసిస్తూ డీఎంకే కార్యకర్తలు రాష్ట్రవ్యాప్తంగా రహదారులపై ఆందోళనలకు దిగారు. తంజావూరులో సీఎం విజయ్ దిష్టిబొమ్మను దహనం చేయగా, పలు ప్రాంతాల్లో నిరసనలతో జనజీవనం స్తంభించింది. మరోవైపు ఉదయనిధి వ్యాఖ్యలను ఖండిస్తూ టీవీకే శ్రేణులు కూడా నిరసన కార్యక్రమాలు చేపట్టడంతో తమిళనాడు రాజకీయాలు మరింత వేడెక్కాయి. ప్రభుత్వం తీరుపై కోర్టు చేసిన వ్యాఖ్యలు తమ వాదనకు బలం చేకూర్చాయని డీఎంకే పేర్కొంటుండగా, ఈ వివాదం రాష్ట్ర రాజకీయాల్లో మరింత చర్చకు దారితీసింది.

# కర్ణాటకలో సెగ... తెలంగాణలో బ్రేక్..!

(మొదటి పేజీ తరువాయి)

### కర్ణాటకలో రగిలిన అసమ్మతి

డీకే శివకుమార్ నేతృత్వంలోని కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవల చేపట్టిన మంత్రివర్గ విస్తరణ ఊహించిన దానికంటే ఎక్కువ రాజకీయ ప్రకంపనలు సృష్టించింది. మంత్రి పదవులు ఆశించిన పలువురు సీనియర్ ఎమ్మెల్యేలకు అవకాశం దక్కకపోవడంతో వారు బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తం చేశారు. కొందరు ఎమ్మెల్యేలు రాజీనామా హెచ్చరికలు చేయడం, మరికొందరు పార్టీ నిర్ణయాలపై బహిరంగ విమర్శలు చేయడం అధిష్ఠానాన్ని ఆందోళనకు గురిచేసింది. అసమ్మతి మరింత పెరగకుండా వెంటనే జోక్యం చేసుకున్న కాంగ్రెస్ అధిష్ఠానం పరిస్థితిని సమీక్షించినట్లు సమాచారం. క్రమశిక్షణ విషయంలో రాజీ ఉండదని స్పష్టం చేస్తూనే, అసంతృప్తి నేతలతో చర్చలు జరిపి పరిస్థితిని చల్లబరచే ప్రయత్నాలు ప్రారంభించింది. మంత్రి పదవులు దక్కని వారికి కార్పొరేషన్లు, ఇతర రాజకీయ అవకాశాలు కల్పించే ప్రత్యామ్నాయాలపైనా చర్చ జరిగినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

### తెలంగాణలో అదే టెన్షన్

కర్ణాటక పరిణామాల నేపథ్యంలో తెలంగాణ కేబినెట్ విస్తరణపై కూడా హైకమాండ్ మరింత అప్రమత్తంగా వ్యవహరిస్తోందని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం సీఎం రేవంత్ రెడ్డి మంత్రివర్గంలో ఇంకా ఖాళీలు ఉండటంతో పాటు, కొందరు మంత్రుల శాఖల మార్పుపైనా చర్చ కొనసాగుతోంది. అయితే అలాంటి నిర్ణయాలు పార్టీలో కొత్త అసమ్మతికి దారితీయవచ్చన్న ఆందోళన కూడా వ్యక్తమవుతోంది. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మంత్రి పదవుల కోసం ఎదురుచూస్తున్న నాయకుల సంఖ్య క్రమంగా పెరిగింది. ఒక్కో సామాజిక వర్గం నుంచి ఒక్కో పేరు వినిపిస్తుండగా... ప్రాంతీయ సమీకరణాలు కూడా పార్టీకి కీలక అంశంగా మారాయి. ఈ పరిస్థితుల్లో ఎవరికైనా అవకాశం దక్కి, మరొకరికి నిరాకరణ ఎదురైతే రాజకీయంగా కొత్త సమస్యలు తలెత్తే అవకాశాన్ని హైకమాండ్ పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది.

### పోటీ మాత్రం తీవ్రంగానే...

మంత్రి పదవుల రేసులో పలువురు సీనియర్ నేతల పేర్లు బలంగా వినిపిస్తున్నాయి. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి, పరిగి రాంమోహన్ రెడ్డి వంటి నేతలు తమకు అవకాశం దక్కుతుందనే ఆశతో ఉన్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఎస్టీ ప్రాతినిధ్యం అంశంలో నేనావత్ బాలునాయక్, రామచంద్ర నాయక్ పేర్లు వినిపిస్తుండగా... స్పీకర్ గడ్డం ప్రసాద్, ఆది శ్రీనివాస్, మధన్ మోహన్, ఎమ్మెల్సీ విజయశాంతి పేర్లు కూడా చర్చలో ఉన్నాయి. యువతకు ప్రాధాన్యం ఇవ్వాలన్న కోణంలో అనిరుధ్ రెడ్డి వంటి పేర్లు కూడా పరిశీలనలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ పరిస్థితుల్లో సామాజిక సమీకరణాలు, ప్రాంతీయ సమతుల్యత, రాజకీయ అవసరాలు, భవిష్యత్ ఎన్నికల వ్యూహం... అన్నింటినీ దృష్టిలో పెట్టుకుని నిర్ణయం తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అందుకే అభ్యర్థుల ఎంపిక కంటే అసమ్మతి నియంత్రణ ఇప్పుడు పెద్ద సవాలుగా మారిందని కాంగ్రెస్ వర్గాలే చెబుతున్నాయి.

### ఇప్పట్లో విస్తరణ కష్టమేనా?

రాజకీయ పరిణామాలతో పాటు పరిపాలనా కార్యక్రమాలు కూడా కేబినెట్ విస్తరణను మరింత వెనక్కి నెట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. సీఎం రేవంత్ రెడ్డి విదేశీ పర్యటన, ఆ తర్వాత జరగనున్న అసెంబ్లీ సమావేశాలు వంటి కార్యక్రమాల కారణంగా తక్షణ నిర్ణయం వచ్చే అవకాశాలు తగ్గాయని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. అంతేకాదు, కర్ణాటకలో ఎదురైన పరిస్థితులను పునరావృతం కాకుండా చూడాలంటే తొందరపాటు నిర్ణయాల కంటే అన్ని వర్గాల అభిప్రాయాలను తీసుకుని ముందుకు వెళ్లడమే ఉత్తమమని అధిష్ఠానం భావిస్తున్నట్లు సమాచారం. దీంతో తెలంగాణ కేబినెట్ విస్తరణ మరోసారి వాయిదా పడే అవకాశాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం... కాంగ్రెస్‌కు ప్రస్తుతం కేబినెట్ విస్తరణ కంటే పార్టీ అంతర్గత సమతుల్యతను కాపాడుకోవడమే పెద్ద సవాలుగా మారింది. కర్ణాటకలోని అనుభవం తర్వాత తెలంగాణలో ప్రతి అడుగూ ఆచితూచి వేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని, అందుకే మంత్రి పదవుల కంటే అసమ్మతి నివారణకే హైకమాండ్ ప్రాధాన్యం ఇస్తోందనే చర్చ కాంగ్రెస్ వర్గాల్లో జోరుగా సాగుతోంది.

# ప్రజల వద్దకే ప్రజావాణి..!

(మొదటి పేజీ తరువాయి)

ప్రత్యక్షంగా హాజరు కాలేని వారు ఆన్‌లైన్ ద్వారా కూడా ఫిర్యాదులు నమోదు చేసుకునే అవకాశం కల్పించనున్నారు. ఫిర్యాదుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించే విధంగా పోర్టల్‌ను అభివృద్ధి చేయాలని అధికారులకు సూచించారు. మండల స్థాయి ప్రజావాణికి ★మండల అభివృద్ధి అధికారి (ఎంపీడీవో)★ను నోడల్ అధికారిగా నియమించారు. ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజల సమస్యలకు త్వరితగతిన పరిష్కారం చూపాలని ప్రభుత్వం ఆదేశించింది. జిల్లా స్థాయిలో ఇప్పటికే అమలవుతున్న ప్రజావాణి తరహాలోనే ఇప్పుడు మండల స్థాయిలోనూ ఈ కార్యక్రమం నిర్వహించడం ద్వారా సులభంగా ప్రభుత్వ సేవలు అందుబాటులోకి వస్తాయని అధికారులు భావిస్తున్నారు.

# మెటాకు కేంద్రం మరో సమన్లు

**మెటాకు కేంద్రం మరో సమన్లు**
**ఢిల్లీలో విచారణకు హాజరుకావాలని గ్లోబల్ బృందానికి ఆదేశం**
**ప్రధాని పోస్టు తొలగింపుపై కేంద్రం ఆగ్రహం**
**సాంకేతిక లోపం పేరుతో తప్పించుకోలేరన్న ఐటీ శాఖ**
**డీప్‌ఫేక్, బాలల భద్రత, వాట్సాప్ ఫీచర్లపై ప్రశ్నల వర్షం**

కాకతీయ, న్యూఢిల్లీ : ప్రధాని పోస్టు ఆటోమేటెడ్ సిస్టమ్ ద్వారా తొలగింపుకు గురైన వ్యవహారాన్ని కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. ఈ నేపథ్యంలో మెటా గ్లోబల్ బృందానికి మరోసారి సమన్లు జారీ చేసింది. అమెరికాలోని మెటా గ్లోబల్ లీడర్‌షిప్ ఈ నెల 5, 6 తేదీల్లో ఢిల్లీలో జరిగే విచారణకు తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించింది. కేంద్ర ఐటీ శాఖ మెటా తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ, గ్లోబల్ టెక్ సంస్థలు భారత చట్టాలకు లోబడి పనిచేయాల్సిందేనని స్పష్టం చేసింది. ఆటోమేటెడ్ సిస్టమ్‌లో లోపం జరిగిందనే కారణంతో బాధ్యత నుంచి తప్పించుకోలేరని, కంటెంట్ మోడరేషన్ వ్యవస్థ ఎలా పనిచేస్తోందో పూర్తి వివరణ ఇవ్వాలని ఆదేశించింది. విచారణలో ఇన్‌స్టాగ్రామ్‌లో బాలల భద్రత, వాట్సాప్‌లో కొత్త ఫీచర్ల వల్ల తలెత్తుతున్న సైబర్ ముప్పు, డీప్‌ఫేక్‌లు, ఏఐ ఆధారిత నకిలీ కంటెంట్ నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై మెటా ప్రతినిధులను ప్రశ్నించే అవకాశం ఉందని సమాచారం.

ఉత్తరం కాకతీయ

బుధవారం 05 ఆగష్టు 2026 

# మిషన్-31కు బీజేపీ మాస్టర్ ప్లాన్!

**రాష్ట్రవ్యాప్తంగా పోరాటాలకు కాషాయ పార్టీ సిద్ధం**

**కాంగ్రెస్ వైఫల్యాలే ప్రధాన అస్త్రంగా ముందుకు**

**సామాజిక సమీకరణలతో కొత్త రాజకీయ వ్యూహం**

**అధికారమే లక్ష్యంగా కేడర్‌కు దిశానిర్దేశం**



కాకతీయ, తెలంగాణ బ్యూరో : తెలంగాణలో అధికారమే లక్ష్యంగా బీజేపీ తన రాజకీయ వ్యూహాన్ని మరింత పదును పెడుతోంది. రాష్ట్రంలో ప్రత్యామ్నాయ శక్తిగా ఎదగాలంటే కేవలం విమర్శలతో సరిపోదని, క్షేత్రస్థాయిలో నిరంతర ప్రజా ఉద్యమాలే విజయానికి మార్గమనే నిర్ణయానికి పార్టీ వచ్చినట్లు కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి సునీల్ బన్సల్, రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు, కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ కుమార్, ఎంపీలు, ఎమ్మెల్యేలతో జరిగిన సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలు భవిష్యత్ రాజకీయాలకు సంకేతాలుగా మారాయి. ఇదే సమయంలో బీజేపీ జాతీయ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు డాక్టర్ కె. లక్ష్మణ్ చేసిన వ్యాఖ్యలు కూడా పార్టీ కార్యాచరణను స్పష్టం చేస్తున్నాయి.

### కాంగ్రెస్ వైఫల్యాలే ప్రధాన ఎజెండా

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో విఫలమైందనే అంశాన్ని గ్రామ స్థాయి వరకు తీసుకెళ్లాలని బీజేపీ నిర్ణయించినట్లు తెలుస్తోంది. రైతు సమస్యలు, నిరుద్యోగం, మహిళలకు ఇచ్చిన హామీలు, సంక్షేమ పథకాల అమలు, అవినీతి ఆరోపణలు, విద్యా, వైద్య రంగాల సమస్యలను ప్రజల్లోకి తీసుకెళ్లేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. వచ్చే నెలల పాటు రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు, ధర్నాలు, బహిరంగ సభలు నిర్వహించే అవకాశాలు కనిపిస్తున్నాయి. పార్టీ సమావేశాల్లో "31" లక్ష్యంపై ప్రత్యేకంగా చర్చ జరిగినట్లు సమాచారం. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కనీసం 31 స్థానాల్లో విజయమే లక్ష్యంగా బీజేపీ సంస్థాగత నిర్మాణాన్ని బలోపేతం చేయాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. బూత్ కమిటీల పునర్వ్యవస్థీకరణ, శక్తికేంద్రాల బలోపేతం, సామాజికవర్గాల వారీగా సమీకరణ, యువత, మహిళలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని నాయకత్వం సూచించినట్లు సమాచారం. ఎన్నికలకు ఇంకా సమయం ఉన్నప్పటికీ ఇప్పటి నుంచే ప్రతి నియోజకవర్గానికి ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేయాలని పార్టీ భావిస్తోంది.

### లక్ష్మణ్ వ్యాఖ్యల్లో వ్యూహాత్మక సంకేతాలు

బీజేపీ జాతీయ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు డాక్టర్ కె. లక్ష్మణ్ కూడా పార్టీ అధికార లక్ష్యాన్ని స్పష్టం చేశారు. తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల్లో విశ్వాసం కోల్పోయిందని, అదే సమయంలో బీజేపీకి ప్రజల్లో ఆదరణ పెరుగుతోందని ఆయన పేర్కొన్నారు. పార్టీ బలం పెంచేందుకు క్షేత్రస్థాయిలో ఉద్యమాలు, ప్రజా సమస్యలపై పోరాటాలు మరింత ఉధృతం చేయాల్సిన అవసరం ఉందని ఆయన సూచించినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటివరకు పార్లమెంట్ ఎన్నికల విజయాన్ని బలంగా ప్రచారం చేసుకున్న బీజేపీ, ఇప్పుడు అదే ఊపును అసెంబ్లీ ఎన్నికలకు మలచే ప్రయత్నంలో ఉంది. అధికార కాంగ్రెస్‌పై రాజకీయ ఒత్తిడి పెంచడంతో పాటు, బీఆర్ఎస్ బలహీనతలను కూడా తనకు అనుకూలంగా మలుచుకోవాలనే వ్యూహంతో ముందుకెళ్తున్నట్లు స్పష్టమవుతోంది. వచ్చే కొద్ది నెలల్లో బీజేపీ చేపట్టనున్న ఉద్యమాలు, ప్రజా కార్యక్రమాలే తెలంగాణ రాజకీయాల దిశను ప్రభావితం చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## తిరుపతిలో వ్యభిచార గృహంపై దాడి

- ఆర్గనైజర్‌తో పాటు ముగ్గురు విటుల అరెస్ట్
- ఇద్దరు మహిళలను రక్షించి హోంకు తరలింపు



కాకతీయ, తిరుపతి : తిరుపతి నగరంలోని అలిపిరి పోలీస్ స్టేషన్ పరిధిలో అక్కారంపల్లి సమీపంలో నిర్వహిస్తున్న వ్యభిచార గృహంపై పోలీసులు దాడి చేసి ఆర్గనైజర్‌తో పాటు ముగ్గురు విటులను అరెస్టు చేశారు. ఇద్దరు మహిళలను రక్షించి హోంకు తరలించారు. పోలీసుల సమాచారం మేరకు అక్కారంపల్లి సమీపంలోని ఓ ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు అందిన విశ్వసనీయ సమాచారంతో అలిపిరి పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడిలో ఆర్గనైజర్ ఎం. అలివేలు మంగమ్మతో పాటు యు. గోవర్ధన్, టి. తిరువేసు, జి. సాయిబాబును అదుపులోకి తీసుకున్నారు. ఘటన స్థలం నుంచి రూ.1,500 నగదు, 10 కండోమ్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి నిందితులను కోర్టులో హాజరుపరచి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు అలిపిరి సీఐ రామకిషోర్ తెలిపారు. బాధిత మహిళలను రక్షించి సంబంధిత హోంకు తరలించినట్లు వెల్లడించారు. వ్యభిచార కార్యకలాపాలపై నిరంతర నిఘా కొనసాగిస్తామని, ఇలాంటి అక్రమాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

## పన్ను ఎగ్గొట్టే ఆస్తి ఉండొద్దు:

**జీడబ్ల్యూఎంసీ కమిషనర్**

కాకతీయ, వరంగల్ ప్రతినిధి: నగరంలోని ప్రతి ఇల్లు, భవనాన్ని ఆస్తి పన్ను పరిధిలోకి తీసుకురావాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న అధికారులను ఆదేశించారు. మంగళవారం టాక్సేషన్ విభాగం అధికారులతో నిర్వహించిన సమీక్షలో కొత్త భవనాల అసెస్‌మెంట్‌ను వెంటనే పూర్తి చేసి, పన్ను పరిధికి దూరంగా ఉన్న ఆస్తులను గుర్తించాలని సూచించారు. ఆస్తి పన్ను, నీటి చార్జీల వసూళ్లకు వారాల వారీ లక్ష్యాలు నిర్దేశించుకుని సాధించాలని, బకాయిలపై ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించాలని ఆదేశించారు. ఉప కమిషనర్లు, రెవెన్యూ అధికారులు రోజువారీగా వసూళ్లను సమీక్షించాలని సూచించారు. సమావేశంలో అదనపు కమిషనర్ ఈసంపల్లి జోన్న, ఉప కమిషనర్లు ప్రసన్న రాణి, బిర్రు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## యువతే ఎమ్మార్పీఎస్‌కు బలం :

**ఏపూరి వెంకటేశ్వర్‌రావు**

కాకతీయ, ఆత్మకూరు: ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో యువతకు పెద్దపీట వేస్తామని హనుమకొండ జిల్లా ఇన్‌చార్జి ఏపూరి వెంకటేశ్వర్‌రావు మాదిగ అన్నారు. మంగళవారం ఆత్మకూరు మండల కేంద్రంలో నిర్వహించిన జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి, సామాజిక న్యాయం సాధనకు యువత ఉద్యమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. గ్రామ స్థాయి నుంచి ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల కమిటీలను పునర్వ్యవస్థీకరించి ఉద్యమాన్ని బలోపేతం చేయాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు ఐక్యంగా పోరాడాలని అన్నారు. సమావేశంలో బండారి సురేందర్ మాదిగ, గద్దల సుకుమార్ మాదిగ, హర్షం సుధాకర్ మాదిగ, వేల్పుల గణేష్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## ఈవీఎం గోడౌన్ భద్రతపై కలెక్టర్ సమీక్ష



కాకతీయ, కొత్తగూడెం ప్రతినిధి: ఈవీఎం గోడౌన్ భద్రతపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కొత్తగూడెం ఆర్డీవో కార్యాలయ ప్రాంగణంలోని ఈవీఎం గోడౌన్‌ను తనిఖీ చేసిన ఆయన, స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరిచిన ఈవీఎంలు, వీవీ ప్యాట్లను పరిశీలించారు. సీసీ కెమెరాల పనితీరు, రికార్డింగ్ వ్యవస్థ, విద్యుత్ బ్యాకప్, భద్రతా ఏర్పాట్లను తనిఖీ చేశారు. అనుమతి లేని వ్యక్తులను గోడౌన్‌లోకి అనుమతించవద్దని, భద్రతా ప్రమాణాలను కచ్చితంగా అమలు చేయాలని సూచించారు. అనంతరం తనిఖీ రిజిస్టర్లను పరిశీలించి సంతకం చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో మధు, ఎన్నికల సూపరింటెండెంట్ రంగ ప్రసాద్, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

## కేరళకు భరోసా..!

**వరద బాధితులకు భారీ ఆర్థిక ప్యాకేజీ ప్రకటించిన పినరయి ప్రభుత్వం**

**మృతుల కుటుంబాలకు రూ.8 లక్షల ఎక్స్‌గ్రేషియా**

**ఇళ్లు, భూములు కోల్పోయిన వారికి పెరిగిన పరిహారం**

**సహాయక చర్యల్లో హెలికాప్టర్లు, మత్స్యకార బోట్లు**

**సోషల్ మీడియా పుకార్లను నమ్మొద్దని సీఎం విజ్ఞప్తి**



కాకతీయ,నేషనల్ డెస్క్ : భారీ వర్షాలు, వరదలు, కొండచరియలు విరిగిపడిన ఘటనలతో తీవ్ర నష్టాన్ని చవిచూసిన కేరళలో సహాయక చర్యలను రాష్ట్ర ప్రభుత్వం వేగవంతం చేసింది. ప్రకృతి విపత్తులో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు అండగా నిలవడంతో పాటు, ఇళ్లు, ఆస్తులు కోల్పోయిన బాధితులను ఆదుకునేందుకు ముఖ్యమంత్రి పినరయి విజయన్ నేతృత్వంలోని ప్రభుత్వం భారీ ఆర్థిక సహాయ ప్యాకేజీని ప్రకటించింది. మృతుల కుటుంబాలకు రూ.8 లక్షల చొప్పున పరిహారం అందించనున్నట్లు వెల్లడించింది. అంతేకాకుండా బాధిత కుటుంబాలకు తక్షణ అవసరాల కోసం వెంటనే రూ.10 వేల అత్యవసర సాయాన్ని విడుదల చేయాలని నిర్ణయించింది. వరద ఉద్ధృతి తగ్గిన తర్వాత పునరావాస శిబిరాల నుంచి ఇళ్లకు తిరిగి వెళ్లే కుటుంబాలు తమ నివాసాలను శుభ్రం చేసుకుని మళ్లీ నివాసయోగ్యంగా మార్చుకునేందుకు మరో రూ.10 వేల ప్రత్యేక సహాయం కూడా అందించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది.

### ఇళ్లు కోల్పోయిన వారికి పెరిగిన పరిహారం

కొండచరియలు విరిగిపడటం, వరదల కారణంగా పూర్తిగా ఇళ్లు, సాగుభూములు కోల్పోయిన బాధితులకు అందించే పరిహారాన్ని ప్రభుత్వం పెంచింది. గతంలో రూ.10 లక్షలుగా ఉన్న ఆర్థిక సాయాన్ని రూ.12 లక్షలకు పెంచింది. అలాగే పూర్తిగా ధ్వంసమైన ఇళ్లను తిరిగి నిర్మించుకునేందుకు ఇచ్చే పరిహారాన్ని రూ.4 లక్షల నుంచి రూ.6 లక్షలకు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిర్ణయం తీవ్ర నష్టాన్ని చవిచూసిన కుటుంబాలకు పెద్ద ఊరటగా మారనుంది. భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో ప్రభుత్వం ముందస్తుగానే రక్షణ చర్యలను ముమ్మరం చేసింది. వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యల కోసం కొల్లాం నుంచి 14 ప్రత్యేక మత్స్యకార బోట్లను చెంగన్నూర్ ప్రాంతానికి తరలించింది. వరదల్లో చిక్కుకున్న వారిని రక్షించేందుకు తమిళనాడులోని సులూరు ఎయిర్‌బేస్ నుంచి రెండు సైనిక హెలికాప్టర్లను కూడా సిద్ధంగా ఉంచింది. ఇదిలా ఉండగా, డ్యామ్‌ల నీటి విడుదల, వరద పరిస్థితులపై సోషల్ మీడియాలో వస్తున్న తప్పుడు ప్రచారాన్ని నమ్మవద్దని ముఖ్యమంత్రి పినరయి విజయన్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అధికారికంగా ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం విడుదల చేసే సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలని సూచించారు. విపత్తు నిర్వహణ బృందాలు, స్థానిక అధికారులకు ప్రజలు సహకరించాలని కోరారు. ప్రతిపక్ష నేత వి.డి. సతీసన్ కూడా ప్రభుత్వ రక్షణ చర్యలను అభినందిస్తూ, బాధితుల పునరావాసానికి అన్ని వర్గాలు సహకరించాలని పిలుపునిచ్చారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

**ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలి : ఎస్పీ బి. మహేష్ గితే**

**రుద్రంగి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎస్పీ**



కాకతీయ,రుద్రంగి : గ్రామీణ ప్రజలు, ముఖ్యంగా యువత సైబర్ నేరాల బారిన పడకుండా విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా ఎస్పీ బి. మహేష్ గితే పోలీసు అధికారులను ఆదేశించారు. మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన స్టేషన్‌లోని రికార్డులు, కేసుల నిర్వహణ, పరిసరాల పరిశుభ్రత, విధుల నిర్వహణ తీరును క్షుణ్ణంగా పరిశీలించి అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో ప్రతి పోలీసు అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించి ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేసేలా పనిచేయాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం, అలసత్వానికి ఏమాత్రం తావులేదని, అలాంటి వారిపై శాఖాపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. గ్రామాల్లో రాత్రి వేళల్లో పెట్రోలింగ్‌ను మరింత పటిష్ఠం చేయాలని, రౌడీషీటర్లు, గంజాయి, పేకాట, పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలపై రాజీ లేకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు, మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై గ్రామాల్లో నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అదేవిధంగా గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటును ప్రజల భాగస్వామ్యంతో విస్తరించాలని, నేరాల నియంత్రణతో పాటు కేసుల ఛేదనలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని ఎస్పీ వివరించారు. ఈ తనిఖీలో డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ రవీందర్, ఎస్ఐ మోతీలాల్‌తో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సంక్షేమమే టీయూడబ్ల్యూజే లక్ష్యం



కాకతీయ, రుద్రంగి: జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, సంక్షేమమే తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే) ప్రధాన ధ్యేయమని జిల్లా అధ్యక్షుడు లాయక్ పాషా అన్నారు. మంగళవారం రుద్రంగి ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన సభ్యులకు రసీదులు పంపిణీ చేశారు. అల్లం నారాయణ, సాగరన్న నాయకత్వంలో జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి సంఘం కృషి చేస్తోందని, అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడిటేషన్ కార్డు అందేలా ప్రభుత్వ దృష్టికి సమస్యలను తీసుకెళ్తామని తెలిపారు. జర్నలిస్టులు ఐక్యంగా ఉండి సంఘ బలోపేతానికి సహకరించాలని పిలుపునిచ్చారు.

## డబుల్ బెడ్‌రూమ్ ఎంపికలో పారదర్శకత



కాకతీయ, కరీంనగర్ : డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికను పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షలో వార్డుల వారీగా క్షేత్రస్థాయిలో సమగ్ర సర్వే చేపట్టి అర్హుల జాబితా సిద్ధం చేయాలని సూచించారు. ప్రతి దరఖాస్తును కనీసం రెండుసార్లు పరిశీలించి, అర్హత ప్రమాణాల మేరకే నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేశారు. సరైన కారణం లేకుండా ఏ దరఖాస్తునూ తిరస్కరించవద్దని పేర్కొన్నారు. స్వయంగా దరఖాస్తుదారుల వివరాలను ధృవీకరించి ఎంపిక ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు.

## ఎంబీబీఎస్, బీడీఎస్ ప్రవేశాలకు నోటిఫికేషన్

- ఆగస్టు 5 నుంచి 12 వరకు ఆన్‌లైన్ దరఖాస్తులు
- కన్వీనర్ కోటా సీట్ల భర్తీకి కాళోజీ హెల్త్ యూనివర్సిటీ ప్రకటన
- నీట్ యూజీ–2026 అర్హులే దరఖాస్తుకు అర్హులు
- వెబ్ ఆప్షన్లకు ముందే సీట్ల మ్యాట్రిక్స్ విడుదల

కాకతీయ, హైదరాబాద్ : తెలంగాణలోని ప్రభుత్వ, ప్రైవేట్ మెడికల్, డెంటల్ కళాశాలల్లో 2026–27 విద్యా సంవత్సరానికి ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల కన్వీనర్ కోటా సీట్ల భర్తీకి కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ మంగళవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. నీట్ యూజీ–2026లో అర్హత సాధించిన అభ్యర్థులు ఆగస్టు 5 ఉదయం 6 గంటల నుంచి ఆగస్టు 12 సాయంత్రం 6 గంటల వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని విశ్వవిద్యాలయం వెల్లడించింది. అభ్యర్థులు అధికారిక ప్రవేశాల పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తుకు ముందు ప్రాస్పెక్టస్‌ను పూర్తిగా చదివి అర్హతలు, రిజర్వేషన్లు, అవసరమైన ధ్రువపత్రాలు, నిబంధనలను పరిశీలించాలని సూచించింది. వెబ్ ఆప్షన్ల ప్రక్రియ ప్రారంభానికి ముందు సీట్ల మ్యాట్రిక్స్‌ను ప్రత్యేకంగా ప్రకటిస్తామని తెలిపింది.

### సర్టిఫికెట్ల అప్‌లోడ్ తప్పనిసరి

ఆన్‌లైన్ దరఖాస్తుతో పాటు అన్ని సంబంధిత ధ్రువపత్రాలను తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాలని యూనివర్సిటీ స్పష్టం చేసింది. నమోదు ప్రక్రియ ఒక్కసారే ఉంటుందని, ప్రతి విడత కౌన్సెలింగ్‌కు మళ్లీ సర్టిఫికెట్లు అప్‌లోడ్ చేయాల్సిన అవసరం లేదని పేర్కొంది. సర్టిఫికెట్ల పరిశీలన అనంతరం తాత్కాలిక మెరిట్ జాబితాను విడుదల చేయనున్నట్లు వెల్లడించింది. మెరిట్ జాబితా విడుదలైన తర్వాత వెబ్ ఆప్షన్లు, కౌన్సెలింగ్ షెడ్యూల్, సీట్ల మ్యాట్రిక్స్‌ను ప్రకటిస్తామని యూనివర్సిటీ తెలిపింది. వెబ్ ఆప్షన్లు నమోదు చేసే సమయంలో కళాశాలల ప్రాధాన్యత క్రమాన్ని ఆలోచించి ఎంపిక చేసుకోవాలని అభ్యర్థులకు సూచించింది. ప్రవేశాలకు సంబంధించిన పూర్తి వివరాలు, తాజా సమాచారాన్ని యూనివర్సిటీ అధికారిక వెబ్‌సైట్‌లో ఎప్పటికప్పుడు పరిశీలించాలని కోరింది.

## విద్యార్థుల మృతికి ప్రభుత్వానిదే బాధ్యత

- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్
- మల్యాల హాస్టల్ ఘటనపై ఫైర్

కాకతీయ, హైదరాబాద్: జగిత్యాల జిల్లా మల్యాల ఎస్సీ హాస్టల్‌లో ఇద్దరు విద్యార్థులు మృతి చెందిన ఘటన ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆరోపించారు. మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ ఘటనను "ప్రభుత్వ వైఫల్యం"గా అభివర్ణిస్తూ విద్యాశాఖ, సంక్షేమ శాఖల పర్యవేక్షణ లోపమే కారణమని విమర్శించారు. ఇటీవల కురిసిన వర్షాలతో విద్యుత్ సరఫరా నిలిచిపోవడం, నీటి సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు ఆరుబయటకు వెళ్లాల్సి వచ్చి ప్రమాదం జరిగిందని పేర్కొన్నారు. రాష్ట్రంలోని సంక్షేమ హాస్టళ్లు, గురుకులాల్లో మౌలిక వసతుల కల్పనలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించిన ఆయన, మృతి చెందిన విద్యార్థుల కుటుంబాలకు రూ.50 లక్షల చొప్పున నష్టపరిహారం ప్రకటించాలని డిమాండ్ చేశారు. అలాగే బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి సస్పెండ్ చేయాలని, రాష్ట్రవ్యాప్తంగా సంక్షేమ హాస్టళ్లలో భద్రత, విద్యుత్, నీటి సౌకర్యాలపై సమగ్ర తనిఖీలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు.

## యోగా పోటీలకు రమదేవి స్కూల్ విద్యార్థులు

**రీజినల్ టోర్నీలో మూడు స్వర్ణ పతకాలతో సత్తా**



కాకతీయ, హైదరాబాద్ : హైదరాబాద్‌లోని నాసర్ స్కూల్‌లో నిర్వహించిన సీఐఎస్‌సీఈ రీజినల్ యోగా టోర్నమెంట్‌లో రమదేవి పబ్లిక్ స్కూల్ విద్యార్థులు పోలగోని గౌతమ్ గౌడ్, దేవరశెట్టి సాయి హర్షిత్ విశేష ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారు. అండర్–17 ట్రెడిషనల్ ఇండివిడ్యువల్ యోగాసన విభాగంలో పోలగోని గౌతమ్ గౌడ్ స్వర్ణ పతకం సాధించగా, అండర్–17 ఆర్టిస్టిక్ ఇండివిడ్యువల్ విభాగంలో దేవరశెట్టి సాయి హర్షిత్ స్వర్ణ పతకం కైవసం చేసుకున్నారు. అండర్–17 ఆర్టిస్టిక్ పెయిర్ యోగాసన విభాగంలో గౌతమ్ గౌడ్–సాయి హర్షిత్ జోడీ మరో స్వర్ణ పతకం గెలిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. మోక్షాస్ యోగా అకాడమీలో కోచ్ నరేష్ శిక్షణలో సాధన చేసిన విద్యార్థుల విజయాన్ని పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు. జాతీయ స్థాయి పోటీల్లోనూ రాణించి తెలంగాణకు మరింత పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

## కల్తీ మసాలాలపై హెచ్-ఫాస్ట్ ఉక్కుపాదం

- హైదరాబాద్‌లో 13 కేంద్రాలపై మెరుపు దాడులు
- 25.3 టన్నుల కల్తీ మసాలాలు, 89.15 టన్నుల ముడిపదార్థాల స్వాధీనం
- ముగ్గురు అరెస్టు.. మూడు క్రిమినల్ కేసుల నమోదు
- సింథటిక్ రంగులు, క్లాత్ డైలు, టాల్కమ్ పౌడర్ వినియోగం వెలుగులోకి

కాకతీయ, హైదరాబాద్ : హైదరాబాద్‌లో కల్తీ మసాలాల తయారీ, విక్రయాలపై హెచ్–ఫాస్ట్ అధికారులు ఉక్కుపాదం మోపారు. ప్రజల నుంచి అందిన సమాచారం ఆధారంగా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి నగరంలోని 13 మసాలా వ్యాపార, ప్రాసెసింగ్ కేంద్రాలపై మెరుపు దాడులు చేపట్టారు. ఈ తనిఖీల్లో 25.3 టన్నుల కల్తీ మసాలాలు, 89.15 టన్నుల ముడిపదార్థాలను స్వాధీనం చేసుకుని, మూడు కేసుల్లో ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. తనిఖీల్లో వాము, జీలకర్ర, లవంగం, షాజీరా, ఆవాలు తదితర మసాలా దినుసుల్లో భారీగా కల్తీ జరిగినట్లు అధికారులు గుర్తించారు. ఉత్పత్తులకు ఆకర్షణీయమైన రంగు, మెరుపు, అధిక బరువు వచ్చేలా సింథటిక్ కలర్స్, ఫ్యాబ్రిక్ డైలు, టాల్కమ్ పౌడర్, ఇండస్ట్రియల్ డైలు, రైస్ బ్రాన్ ఆయిల్ వంటి ప్రమాదకర రసాయనాలను వినియోగిస్తున్నట్లు వెల్లడైంది. కొన్ని ఉత్పత్తుల్లో హెయిర్ కలర్‌ను కూడా ఉపయోగించినట్లు అధికారులు గుర్తించారు.

### ల్యాబ్ పరీక్షలకు నమూనాలు

స్వాధీనం చేసుకున్న మసాలా నమూనాలను ప్రయోగశాల పరీక్షలకు పంపించారు. పరీక్షల నివేదికల ఆధారంగా ఆహార భద్రత చట్టం ప్రకారం నిందితులపై కఠిన చర్యలు తీసుకోనున్నట్లు అధికారులు తెలిపారు. కల్తీ ఆహార పదార్థాల వినియోగంతో కాలేయం, మూత్రపిండాల సమస్యలు, క్యాన్సర్, అలర్జీలు, జీర్ణ సంబంధ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరించారు. హెచ్–ఫాస్ట్ ఏర్పాటు చేసిన తర్వాత 140 రోజుల్లో 659 దాడులు నిర్వహించి, 202 కేసులు నమోదు చేసి, 246 టన్నుల కల్తీ ఆహార పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. కల్తీ ఆహార పదార్థాల కేసుల దర్యాప్తు కోసం త్వరలో ప్రత్యేక సిట్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అనుమానాస్పద ఆహార పదార్థాలపై వెంటనే పోలీసులకు లేదా హెచ్–ఫాస్ట్ హెల్ప్‌లైన్‌కు సమాచారం ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## మేడారం అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి : మంత్రి సీతక్క

కాకతీయ, ములుగు ప్రతినిధి: మేడారం సమ్మక్క–సారలమ్మ ఆలయ పరిసరాల్లో చేపట్టిన చివరిదశ అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని రాష్ట్ర మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. మంగళవారం పనులను పరిశీలించిన ఆమె వనదేవతలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సమ్మక్క భవన్‌లో నిర్వహించిన మహిళల ఉచిత టైలరింగ్ శిక్షణ కార్యక్రమంలో పాల్గొని కుట్టుమిషన్లను పంపిణీ చేశారు. మహిళలు స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. ఆలయ అభివృద్ధి పనులు నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంపత్‌రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, పంచాయతీరాజ్ డైరెక్టర్ భగవాన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నాగ సుబ్రహ్మణ్యేశ్వరుడికి విశేష పూజలు



కాకతీయ, గీసుగొండ : మండలంలోని ఊకల్ హవేలీ గ్రామంలో వెలసిన శ్రీ వల్లీ దేవసేన సమేత నాగ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయంలో ఆషాఢ బహుళ షష్ఠి సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు డాక్టర్ సముద్రాల సుదర్శనాచార్యులు వైదిక మంత్రోచ్ఛారణల మధ్య స్వామివారికి పంచామృతాభిషేకం, ప్రత్యేక అర్చనలు నిర వ్వహించారు. మ ల్లెపూల తో అలంకరించి మహామంగళహారతి సమర్పించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ తిమ్మాపురం రాజేశ్వరరావు, కోశాధికారి కొత్తగట్టు రాజేందర్, కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

### పార్కులు, వైకుంఠధామాలను పరిశుభ్రంగా ఉంచాలి

**జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న**

కాకతీయ, వరంగల్ ప్రతినిధి: నగరంలోని పార్కులు, వైకుంఠధామాలను పరిశుభ్రంగా, ప్రజలకు ఆదర్శంగా తీర్చిదిద్దాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న అధికారులను ఆదేశించారు. మంగళవారం పలు ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించిన ఆయన, ప్రొఫెసర్ జయశంకర్ పార్కులో ఈ నెల 6న జరిగే జయంతి వేడుకలకు ముందే హరితీకరణ, పరిశుభ్రత, విద్యుత్ దీపాలు, నడక మార్గాల పనులు పూర్తి చేయాలని సూచించారు. అనంతరం పోచమ్మకుంట, టీవీ టవర్ వైకుంఠధామాలను పరిశీలించి పారిశుద్ధ్యం, హరితీకరణ, తాగునీరు, విద్యుత్, అంతర్గత రహదారుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. తనిఖీల్లో సీఎంహెచ్‌వో డా. రాజారెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

## పెండింగ్ ఫైళ్లను వెంటనే పరిష్కరించాలి

**జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న**



కాకతీయ, వరంగల్ ప్రతినిధి: కార్యాలయాల్లో పెండింగ్ ఫైళ్లను నిర్దేశిత గడువులోగా పరిష్కరించి ప్రజలకు వేగవంతమైన సేవలు అందించాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న అధికారులను ఆదేశించారు. మంగళవారం జీడబ్ల్యూఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఇన్‌వర్డ్, పెన్షన్, పబ్లిక్ హెల్త్, టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్ విభాగాలను ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు, పెండింగ్ దరఖాస్తులను పరిశీలించారు. ప్రజలతో మర్యాదగా వ్యవహరించి వారి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సూచించారు. కార్యాలయాల్లో పరిశుభ్రత, సమయపాలన, రికార్డుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. తనిఖీల్లో అదనపు కమిషనర్ ఈసంపల్లి జోనా, పర్యవేక్షకుడు సంతోష్తో పాటు వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## మాస్టర్‌జీ హైస్కూల్‌లో ఇన్వెస్టిచర్ సెర్మనీ

**హెడ్ బాయ్‌గా ప్రద్యుమ్న, హెడ్ గర్ల్‌గా అవని బాధ్యతల స్వీకరణ**



కాకతీయ, హనుమకొండ : కిషన్‌పురాలోని మాస్టర్‌జీ హైస్కూల్‌లో ఇన్వెస్టిచర్ సెర్మనీ ఘనంగా నిర్వహించారు. మాజీ కుడా చైర్మన్, మాస్టర్‌జీ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ ఎస్. సుందర్ రాజు ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు బాధ్యత, క్రమశిక్షణ, సేవాభావంతో నాయకత్వాన్ని ప్రదర్శించాలని సూచించారు. ఈ సందర్భంగా హెడ్ బాయ్‌గా జె. ప్రద్యుమ్న, హెడ్ గర్ల్‌గా అవని బాధ్యతలు స్వీకరించగా, 23కు పైగా విభాగాలకు విద్యార్థి నాయకులను ఎంపిక చేసి బాధ్యతలు అప్పగించారు. విద్యార్థులు ప్రతిజ్ఞ చేసి పదవీ బాధ్యతలు చేపట్టారు. ప్రిన్సిపాల్ డి. రజిత, వైస్ ప్రిన్సిపాల్ రాధిక, ఏఓ నాగరాజు, పీఈటీ రాజాబాబు, ఇందిర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమం నాయకత్వ లక్షణాలు, టీమ్‌వర్క్, సేవాభావాన్ని పెంపొందించేలా సాగింది.

## నన్నపునేనికి కేటీఆర్ బర్త్ డే విషెస్



కాకతీయ, వరంగల్ ప్రతినిధి: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే. తారక రామారావు (కేటీఆర్) పార్టీ సీనియర్ నాయకుడు నన్నపునేని నరేందర్కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ బలోపేతానికి నరేందర్ చేస్తున్న కృషి, అంకిత భావం అభినందనీయమని పేర్కొన్నారు. ఇలాంటి నిబద్ధత కలిగిన నాయకుల శ్రమ వల్లే పార్టీ ప్రజల్లో బలంగా నిలిచిందన్నారు. నరేందర్ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, భవిష్యత్తులోనూ పార్టీకి, ప్రజలకు మరింత సేవలు అందించాలని ఆకాంక్షించారు. కేటీఆర్ పంపిన పుష్పగుచ్ఛాన్ని స్వీకరించిన నన్నపునేని నరేందర్ ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# సంక్షేమం–అభివృద్ధికి సమ ప్రాధాన్యం : మంత్రి సీతక్క

- తల్లిపాల వారోత్సవ పోస్టర్ ఆవిష్కరణ..
- మేడారం పనుల సమీక్ష.. విద్యార్థినులకు ల్యాప్‌టాప్‌ల పంపిణీ



కాకతీయ, ఏటూరునాగారం : ములుగు జిల్లాలో సంక్షే మం, అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లాలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి తల్లిపాల వారోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించి, వైద్య సేవలు, మేడారం అభివృద్ధి పనులు, మహిళల సాధికారత, విద్యార్థుల ఉన్నత విద్యపై దిశానిర్దేశం చేశారు. ఏటూరునాగారం ఐటీడీఏ కార్యాలయంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించిన మంత్రి, తొలి ఆరు నెలలు శిశువులకు పూర్తిగా తల్లిపాలే అందించాలని సూచించారు. అనంతరం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను సందర్శించి సీజనల్ వ్యాధులు, వైద్య సేవలపై సమీక్ష నిర్వహించారు. చిన్నచిన్న సమస్యలకే రోగులను ఇతర ప్రాంతాలకు పంపకుండా స్థానికంగానే మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. రూ.30 లక్షలతో నిర్మించిన అంతర్గత సీసీ రోడ్లను ప్రారంభించి రోగులను పరామర్శించారు. మేడారంలోని సమ్మక్క–సారలమ్మ ఆలయ అభివృద్ధి పనులను పరిశీలించిన మంత్రి చివరిదశ పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేసి స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కన్నాయిగూడెం కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయంలో 20 మంది విద్యార్థినులకు ల్యాప్‌టాప్‌లు అందజేసి నీట్, ఐఐటీ, జేఈఈ, క్లాట్ వంటి పోటీ పరీక్షలను లక్ష్యంగా పెట్టుకుని కృషి చేయాలని ప్రోత్సహించారు. కార్యక్రమాల్లో జిల్లా అదనపు కలెక్టర్ సంపత్‌రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

# మూడో కన్నులేక మూగబోయిన భద్రత..!

- రాయపర్తిలో కరువైన సీసీ కెమెరాల నిఘా
- నిత్యం రోడ్డు ప్రమాదాలతో ప్రజలు బెంబేలు
- ప్రజా భద్రతను గాలికి వదిలేసిన పోలీసు యంత్రాంగం
- నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న అధికారులు
- తక్షణమే సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజల డిమాండ్



కాకతీయ,రాయపర్తి : ఒక సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానం అని పోలీసు ఉన్నతాధికారులు తరుచూ చెప్పే మాటలు క్షేత్రస్థాయిలో ప్రకటనలకే పరిమితమవుతున్నాయి.రాయపర్తి మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో భద్రతకు కీలకమైన మూడో కన్ను (సీసీ కెమెరాలు) మందగించడంతో ప్రజా భద్రత ప్రశ్నార్థకంగా మారింది.ప్రధాన కూడళ్ళు,వాణిజ్యసముదాయాలు,గ్రామ సరిహద్దు మార్గాల్లో సీసీ కెమెరాలు లేకపోవడంతో రోడ్డు ప్రమాదాలు, దొంగతనాలు పెరిగిపోతున్నాయి.మండల కేంద్రంలోని వరంగల్ ఖమ్మం జాతీయ రహదారిపై ప్రయాణమంటేనే ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. రోజురోజుకు రోడ్డు ప్రమాదాలు విపరీతంగా పెరుగుతూండడంతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు.రోడ్లపై కనీస నిఘా లేకపోవడంతో అమాయకులు రోడ్డు ప్రమాదాల్లో బలవుతున్నారు.

### నిఘా నేత్రంపై పోలీసుల అలసత్వం

వ్యాపారులు,ప్రజాప్రతినిధులు,దాతల భాగస్వామ్యంతో ప్రతి గ్రామంలో,చౌరస్తాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని పోలీసు శాఖ ప్రకటించినా... ఆచరణలో మాత్రం అలసత్వం వహిస్తున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.శాంతిభద్రతల పరిరక్షణకు ప్రభుత్వ పరంగా కెమెరాలు పెట్టకపోవడంతో,పోలీసులు ప్రైవేటు వ్యాపారులు తమ షాపుల ముందు సొంత ఖర్చుతో పెట్టుకున్న కెమెరాలపైనే ఆధారపడుతున్నారు.ఏదైనా రోడ్డు ప్రమాదం,దొంగతనం జరిగినప్పుడు మాత్రమే హడావుడి చేసే పోలీసులు... నివారణ చర్యగా కెమెరాలు ఏర్పాటు చేయడంలో మాత్రం కాలయాపన చేస్తున్నారని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### ఉన్నతాధికారులు స్పందించాలి

ఇప్పటికైనా జిల్లా పోలీసు యంత్రాంగం, ప్రజాప్రతినిధులు తక్షణమే స్పందించాలి.మండల పరిధిలోని ప్రమాదకర ప్రాంతాలు,చౌరస్తాలు,సరిహద్దు మార్గాల్లో వెంటనే సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి ప్రమాదాల నివారణకు,ప్రజారక్షణకు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

### సీసీ కెమెరాల ఏర్పాటుకు దాతలు ముందుకు రావాలి : ఎస్సై ముత్యం రాజేందర్



మండలంలోని ప్రతి గ్రామంలో నేరాల నివారణకు రోడ్డు ప్రమాదాలను అరికట్టడానికి సీసీ కెమెరాలు ఏర్పాటుపై ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని అన్నారు.ఈ బృహత్తర కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు,వ్యాపారులు దాతలు స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని ఎస్సై కోరారు.

## ఎన్ఎల్ఎం రుణం పేరుతో రూ.12.80 లక్షల మోసం

**ముగ్గురిపై మట్టెవాడ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు**

కాకతీయ, వరంగల్ ప్రతినిధి : నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్ (ఎన్ఎల్ఎం) పథకం కింద గొర్రెల పెంపకానికి తక్కువ వడ్డీపై రుణం ఇప్పిస్తామని నమ్మించి రూ. 12.80 లక్షలు వసూలు చేసి మోసం చేసిన ఘటనలో ముగ్గు రిపై మట్టెవాడ పోలీసులు కేసు నమోదు చేశారు. దుగ్గొండి మండలం మల్లంపల్లికి చెందిన వెండి రవీందర్, అతని కుమారులు వెం డి శ్రీరామ్, వెండి పృథ్వీరాజ్ 2023 నుంచి విడతల వారీగా రూ. 12.80 లక్షలు తీసుకుని రుణం మంజూరు చేయకుండా కాలయాపన చేశారని బాధితుడు అడప రాజేష్ ఫిర్యాదులో పేర్కొ న్నారు. 2026 మే 20న పెద్దమనుషుల సమక్షంలో జరిగిన పం చాయితీలో డబ్బు తిరిగి చెల్లిస్తామని లేదా 2 ఎకరాల 5 గుంటల భూమి రిజిస్ట్రేషన్ చేస్తామని నోట రీ బాండ్ ఇచ్చినా హామీ నిలబెట్టుకోలేదని ఆరోపించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ముగ్గురు నిందితులపై మోసం, నమ్మకద్రోహం, నేరపూరిత బెదిరింపులకు సంబంధించిన భారతీయ న్యాయసంహిత (బీఎన్ఎస్) సెక్షన్ల కింద మట్టెవాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

# రీ-సర్వే వేగవంతం చేయాలి

- రైతులకు ముందస్తు సమాచారం ఇచ్చి పనులు పూర్తి చేయాలి
- హన్మకొండ జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎన్. రవి



కాకతీయ, హనుమకొండ : భూముల రీ–సర్వే ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని, సర్వేకు సంబంధించిన సమాచారాన్ని ముందుగానే రైతులకు తెలియజేసి వారి సహకారంతో పనులు చేపట్టాలని హనుమకొండ జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎన్. రవి సర్వేయర్లను ఆదేశించారు. మంగళవారం ఐనవోలు మండలం పంథిని గ్రామంలో భూములు కొలతల శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న రీ–సర్వే పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామంలో ఇప్పటివరకు రీ–సర్వే పూర్తయిన విస్తీర్ణం, రోజువారీ పురోగతి, రోవర్ పరికరాల వినియోగంపై సర్వేయర్లను అడిగి తెలుసుకున్న కలెక్టర్, రైతులతో మాట్లాడి ఎదురవుతున్న సమస్యలపై ఆరా తీశారు. ప్రస్తుతం రెండు సర్వే బృందాలు పనులు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రతి సర్వే బృందం రోజుకు కనీసం 75 ఎకరాల భూమిని రీ–సర్వే చేసేలా ప్రణాళిక రూపొందించాలని, సర్వే తేదీలు, సమయాలపై రైతులకు ముందస్తు సమాచారం అందించాలని కలెక్టర్ సూచించారు. రైతుల సమన్వయంతో లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయవచ్చన్నారు. నాణ్యతతో పాటు పారదర్శకతకు ప్రాధాన్యం ఇస్తూ రైతులకు ఇబ్బందులు కలగకుండా రీ–సర్వే నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. పరిశీలనలో భూములు కొలతల శాఖ సహాయ సంచాలకులు నూర్ సింగ్, తహసీల్దార్ విక్రమ్ కుమార్, సర్వేయర్ సూరజ్ కుమార్, జీపీవో శ్రీకాంత్, స్థానిక రైతులు పాల్గొన్నారు.

## ఆఫీసర్స్ క్లబ్ నూతన కార్యవర్గానికి ఓబీసీ సన్మానం

**సెక్రటరీ ప్రవీణ్‌తో పాటు ఈసీ సభ్యులకు అభినందనలు**



కాకతీయ, హనుమకొండ: హనుమకొండ రాంనగర్‌లోని ఓబీసీ కార్యాలయంలో ఆఫీసర్స్ క్లబ్ నూతన సెక్రటరీ పొక్కుల ప్రవీణ్, ఈసీ సభ్యులు గట్టు రాజు, పల్లం రవి, మంచికుంట్ల ప్రవీణ్లను ఓబీసీ కమిటీ ఘనంగా సన్మానించింది. మాజీ కుడా చైర్మన్, ఓబీసీ చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో తొలుత ఆత్మీయ సమావేశం నిర్వహించి, అనంతరం శాలువాలు కప్పి అభినందించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గం ఆఫీసర్స్ క్లబ్ అభివృద్ధికి కృషి చేయాలని, సభ్యుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని పలువురు ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఓబీసీ ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ గడ్డం భాస్కర్, భూపాలపల్లి జేఏసీ అధ్యక్షుడు సూరం రవీందర్, తెలంగాణ లెక్చరర్స్ ఫోరం రాష్ట్ర సలహాదారు వేణుమాధవ్, గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొనగాని యాదగిరి గౌడ్, గౌడ యువజన సంఘం అధ్యక్షుడు ఎరుకొండ పవన్, బీసీ అడ్వకేట్స్ సంఘం నాయకుడు బందా వివేకానంద, బీసీ మహిళా నేతలు పద్మజ, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దడమే నా ధ్యేయం

**సర్పంచ్ చిర్ర యాకాంతం గౌడ్**




కాకతీయ, నెల్లికుదురు: మండలంలోని బ్రాహ్మణ కొత్తపెల్లి గ్రామాన్ని స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దడమే నా ధ్యేయమని సర్పంచ్ చిర్ర యాకాంతం గౌడ్ అన్నారు. బ్రాహ్మణకొత్తపల్లి గ్రామంలో మంగళవారం నిర్వహించిన ప్రత్యేక గ్రామ సభలోగ్రామ సర్పంచ్ డా చిర్ర యాకాంతం గౌడ్ మాట్లాడుతూ ఎజెండా అంశాలలో భాగంగా ఆడపిల్లల, మహిళల భద్రత విషయాలలో పాటించవలసిన అంశాలు, ఇంకుడు గుంతలు, పంట గుంటలు ప్రతి ఒక్కరూ తప్పకుండా సద్వినియోగించుకోవాలని, గ్రామాన్ని స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దడం కోసం గ్రామ ప్రజలు ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. అనంతరం గ్రామంలోని ప్రతి ఇంటికి గ్రామపంచాయతీ నుండి బ్లీచింగ్ పౌడర్ ప్యాకెట్లు పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎర్ర రవి, ఉపసర్పంచ్ పిట్టల ఉప్పలయ్య, వార్డు సభ్యులు పిడుగు అనంత, బొల్లు మురళి, అంగన్వాడీ టీచర్లు, మహిళా సంఘాల ప్రతినిదులు, మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, యువత గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## పీహెచ్‌సీపై డీఎంహెచ్‌వో ఆకస్మిక తనిఖీ



కాకతీయ, మల్హార్: తాడిచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారి డాక్టర్ మధుసూదన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు, ఓపీ రిజిస్టర్, ఔషధ నిల్వలు, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించి వైద్య సేవలపై సమీక్ష నిర్వహించారు. సబ్‌సెంటర్ల వారీగా టీబీ, ఇతర ఆరోగ్య కార్యక్రమాల అమలును సమీక్షించి, పనితీరు తక్కువగా ఉన్న కేంద్రాల్లో టీబీ, ఎన్‌సీడీ స్క్రీనింగ్ను విస్తృతంగా నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం వనమహోత్సవంలో పాల్గొని పీహెచ్‌సీ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారులు డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ దేవేందర్, డాక్టర్ సందీప్, డాక్టర్ నాగరాణి, డీడీఎం మధుబాబు, డీపీఓ చిరంజీవి, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వినయ్ భాస్కర్తో పాటు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఆగస్టు 6 నుంచి దోస్త్ రెండో స్పెషల్ డ్రైవ్

కాకతీయ, గీసుగొండ: 2026–27 విద్యా సంవత్సరానికి డిగ్రీ ప్రవేశాల కోసం దోస్త్ రెండో స్పెషల్ డ్రైవ్ను ఆగస్టు 6 నుంచి 11 వరకు నిర్వహిస్తున్నట్లు ధర్మారంలోని ఎస్ఎస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కొక్కొండ శ్రీకాంత్ తెలిపారు. ఈ నెల 6 నుంచి 11 వరకు రిజిస్ట్రేషన్, 6 నుంచి 12 వరకు వెబ్ ఆప్షన్ల నమోదుకు అవకాశం ఉందన్నారు. సీట్ల కేటాయింపు ఆగస్టు 14న ఉంటుందని తెలిపారు. ఇంట్రా కాలేజ్ ఫేజ్‌ను ఆగస్టు 20, 21 తేదీల్లో నిర్వహించి, 22న సీట్లు కేటాయిస్తామని చెప్పారు. ఇప్పటికే సీసీ ఓటీపీ ద్వారా ప్రవేశం ఖరారు చేసుకున్న విద్యార్థులు ఈ దశకు అర్హులు కారని స్పష్టం చేశారు. వివరాలకు 9963591463ను సంప్రదించాలని సూచించారు.

## గుంతలను పూడ్చిన జీపీ పాలకవర్గం



కాకతీయ, ఇనుగుర్తి: నెల్లికుదురు–కేసముద్రం రహదారిపై మండలంలోని చిన్ననాగారం గ్రామ శివారులో ప్రమాదకరంగా ఏర్పడిన గుంతలను గ్రామ పంచాయతీ పాలకవర్గం మంగళవారం పూడ్చివేసింది. సర్పంచ్ చెడుపాక సుజాత–యాకయ్య ఆధ్వర్యంలో ట్రాక్టర్‌తో మొరం తరలించి గుంతలను పూడ్చి రాకపోకలు సులభతరం చేశారు. రహదారిపై గుంతల కారణంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుండటంతో ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యగా ఈ పనులు చేపట్టినట్లు సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు బైరు వెంకటేశ్వర్లు, మునిగంటి సరిత–రాజు తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి బీఆర్ఎస్ ఆర్థిక చేయూత



కాకతీయ, కారేపల్లి: కారేపల్లి మండల కేంద్రంలోని అంబేద్కర్ కాలనీకి చెందిన చిరుముల రాములు ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని బీఆర్ఎస్ జిల్లా మైనార్టీ నాయకుడు షేక్ గౌసుద్దీన్ మంగళవారం పరామర్శించారు. దశదిన కార్యక్రమానికి హాజరైన ఆయన, రాములు భార్య ఎల్లబ్బాయికి రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. కుటుంబ పెద్దను కోల్పోయిన వారికి అండగా నిలవడం సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు డొంకిన రవీందర్ గౌడ్, పాలిక వీరస్వామి, వెంకటేశ్వర్లు, చింతల సంపత్, ఎండీ ఖలీలుల్లా ఖాన్, సోమందుల వెంకటేశ్వర్, షేక్ అజారుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## జైల్ భరో విజయవంతం చేయాలి



కాకతీయ, కారేపల్లి: కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా ఆగస్టు 10న నిర్వహించే జైల్ భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ సింగరేణి మండల కన్వీనర్ కే. నరేంద్ర పిలుపునిచ్చారు. కారేపల్లి పీహెచ్‌సీలో తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షురాలు వాంకుడోత్ కమల అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మిక చట్టాల రద్దు, లేబర్ కోడ్‌లు, ఉపాధి హామీ, విద్యుత్ చట్టం వంటి అంశాలతో కార్మికులు, రైతులు నష్టపోతున్నారని విమర్శించారు. ఆశా వర్కర్లకు రూ.18 వేల స్థిర వేతనం, ఉద్యోగ భద్రత, పనిభారం తగ్గింపు వంటి డిమాండ్లతో జైల్ భరోలో పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా నాయకురాలు పద్మ, జంగా కళ్యాణి, ఈసం ఈశ్వరి, సరస్వతి, వై. పద్మ తదితరులు పాల్గొన్నారు.

## కారేపల్లి పోలీస్ స్టేషన్‌లో సీపీ ఆకస్మిక తనిఖీ

### బాధితుల ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని ఆదేశం



కాకతీయ, కారేపల్లి : కారేపల్లి పోలీస్ స్టేషన్‌ను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వార్షిక తనిఖీల్లో భాగంగా స్టేషన్ నిర్వహణ, రికార్డులు, సీజ్ చేసిన వాహనాలు, జనరల్ డైరీ, విచారణ పురోగతిని పరిశీలించారు. అనంతరం అధికారులతో సమావేశమై పలు సూచనలు చేశారు. గ్రామాలు, ప్రధాన కూడళ్లలో సీసీటీవీ కెమెరాల ఏర్పాటుపై ప్రజల్లో అవగాహన కల్పించాలని, పెండింగ్ కేసులను వేగంగా పరిష్కరించాలని ఆదేశించారు. డయల్–100 స్పందన సమయాన్ని మెరుగుపరచడంతో పాటు రౌడీషీటర్లు, పేకాట శిబిరాలు, ఇతర అక్రమ కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా కొనసాగించాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితుల ఫిర్యాదులపై ఎలాంటి అలసత్వం ప్రదర్శించకుండా తక్షణమే స్పందించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ తిరుపతి రెడ్డి, సీఐ సాగర్, ఎస్సై గోపి పాల్గొన్నారు.

# రోడ్లా.. చెరువులా..?

### డ్రైనేజీ లేక భాగ్యనగర్ తండాలో జలదిగ్బంధం



కాకతీయ, కారేపల్లి : ఖమ్మం జిల్లా సింగరేణి మండలం భాగ్యనగర్ తండాలో వర్షం పడితే రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో వర్షపు నీరు రోడ్లపై నిలిచిపోవడంతో పాటు ఇళ్లలోకి చేరి స్థానికులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. గుగులోత్ అంజి ఇంటి వద్ద ప్రతి వర్షానికి నీరు చేరుతుండటంతో వృద్ధ దంపతులు రాత్రిళ్లు నిద్ర లేక జాగారం చేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మలోత్ రాంబాబు ఇంటి వద్ద కూడా ఇదే పరిస్థితి నెలకొంది. సమస్యను పలుమార్లు గ్రామపంచాయతీ అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం చూపలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. వర్షం పడిన ప్రతిసారీ రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుండగా, ఇళ్లలోకి నీరు చేరి ప్రజలు అవస్థలు పడుతున్నారని తెలిపారు. వెంటనే పక్కా డ్రైనేజీ నిర్మించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని తండావాసులు డిమాండ్ చేస్తున్నారు.

# ప్రైవేట్ స్కూళ్లకు అండెవరిది..?

- ఏన్కూర్‌లో ఫీజుల దందాపై తల్లిదండ్రుల ఆగ్రహం
- యూనిఫామ్‌లు, పుస్తకాల కొనుగోళ్లలో కమిషన్ ఆరోపణలు
- విద్యాశాఖ మౌనంపై అనుమానాలు
- కలెక్టర్ జోక్యంతో సమగ్ర విచారణ కోరుతున్న బాధితులు




కాకతీయ, ఏన్కూర్ : ఏన్కూర్ మండలంలో ప్రైవేట్ పాఠశాలల ఫీజుల వ్యవహారం తల్లిదండ్రులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. ప్రభుత్వం నిర్ణయించిన నిబంధనలు ఉన్నప్పటికీ కొన్ని ప్రైవేట్ విద్యాసంస్థలు ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా ఇటీవల ప్రారంభమైన ఓ ప్రైవేట్ పాఠశాల భారీ ఫీజులతో పాటు యూనిఫామ్‌లు, పాఠ్యపుస్తకాల కొనుగోలులోనూ తల్లిదండ్రులపై ఒత్తిడి తెస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. పాఠశాల యాజమాన్యం సూచించిన దుకాణాల్లోనే యూనిఫామ్‌లు, పుస్తకాలు కొనుగోలు చేయాలని తల్లిదండ్రులను బలవంతం చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇందుకోసం వస్త్ర, పుస్తక దుకాణాలతో కమిషన్ ఒప్పందాలు కుదుర్చుకున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. బహిరంగ మార్కెట్‌లో తక్కువ ధరలకు లభించే వస్తువులను అధిక ధరలకు కొనుగోలు చేయాల్సి వస్తోందని తల్లిదండ్రులు వాపోతున్నారు. రోజువారీ కూలీ పనులు చేసుకునే కుటుంబాలు పిల్లల చదువుల కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### నిబంధనలు అమలవుతున్నాయా..?

ప్రైవేట్ పాఠశాలల ఫీజుల నియంత్రణ, బలవంతపు కొనుగోళ్లను అరికట్టాల్సిన విద్యాశాఖ అధికారులు మాత్రం ఈ వ్యవహారంపై మౌనం పాటిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఫిర్యాదులు వస్తున్నప్పటికీ తనిఖీలు నిర్వహించకపోవడం, చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందని స్థానికులు అంటున్నారు. దీంతో ప్రైవేట్ పాఠశాలలకు అధికారుల అండదండలు ఉన్నాయా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. తల్లిదండ్రులపై పడుతున్న ఆర్థిక భారాన్ని దృష్టిలో ఉంచుకుని జిల్లా కలెక్టర్ స్వయంగా జోక్యం చేసుకుని మండలంలోని ప్రైవేట్ పాఠశాలల ఫీజుల నిర్మాణం, యూనిఫామ్‌లు, పాఠ్యపుస్తకాల విక్రయ విధానాలపై సమగ్ర విచారణ చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘించిన యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు తీసుకుని విద్యా వ్యవస్థలో పారదర్శకత తీసుకురావాలని కోరుతున్నారు.

# నిరుద్యోగుల పాలిట కాంగ్రెస్ 'మరణ శాసనం'




- హామీలన్నీ నీటిమూటలే : బీఆర్ఎస్ నేత ఏనుగుల రాకేష్ రెడ్డి
- ఉద్యోగాల భర్తీ, జాబ్ క్యాలెండర్‌పై ప్రభుత్వాన్ని నిలదీత

కాకతీయ, ఖమ్మం : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రకటించిన 'యూత్ డిక్లరేషన్' నిరుద్యోగుల పాలిట మరణ శాసనంగా మారిందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి విమర్శించారు. మధిర నియోజకవర్గానికి చెందిన నిరుద్యోగి గడ్డం వేణు గౌడ్‌ను పరామర్శించిన అనంతరం ఖమ్మంలోని తెలంగాణ భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగాల కోసం ఏళ్ల తరబడి సిద్ధమవుతున్న యువతకు సరైన జాబ్ క్యాలెండర్ లేకపోవడం, ఉద్యోగాలు రాకపోవడం వల్లే గడ్డం వేణు గౌడ్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని అన్నారు. వేణు రాసిన సూసైడ్ నోట్ తెలంగాణ నిరుద్యోగుల ఆవేదనకు ప్రతిబింబమని పేర్కొన్నారు. ఆ నోట్‌ను దాచిపెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, యూత్ డిక్లరేషన్ హామీలు అమలు కాలేదని రాకేష్ రెడ్డి విమర్శించారు. ఏడాదికి రెండు లక్షల ఉద్యోగాలు, మెగా డీఎస్సీ, జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి, జీవో 46 రద్దు వంటి హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. కానిస్టేబుల్, ఎస్సై దరఖాస్తులకు భారీ ఫీజులు వసూలు చేస్తూ నిరుద్యోగులపై అదనపు భారం మోపుతున్నారని ఆరోపించారు. వేణుకు అత్యుత్తమ వైద్యం అందించాలని, రూ.5 లక్షల ఆర్థిక సాయం ప్రకటించాలని, పక్కా ఇల్లు మంజూరు చేయాలని, ఖాళీగా ఉన్న 19 వేల పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేయాలని, కానిస్టేబుల్, ఎస్సై అభ్యర్థులకు వయోపరిమితి సడలింపు ఇవ్వాలని, స్పష్టమైన జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని బీఆర్ఎస్ తరఫున డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో గూడా సంజీవ్ రెడ్డి, బలుసు మురళీకృష్ణ, మద్దెల విజయ్ కుమార్, ఈదుల రాజేష్, షారూక్, జడల కళ్యాణ్, సాయిదీప్, సాయి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# రెండు నెలల వేతనాలు వెంటనే చెల్లించాలి



- పెండింగ్ ఈపీఎఫ్‌ను కార్మికుల ఖాతాల్లో జమ చేయాలి: ఐఎఫ్‌టీయూ

కాకతీయ, ఇల్లందు : కోయగూడెం ఓపెన్‌కాస్ట్‌లో ఓబీ పనులు నిర్వహిస్తున్న ఎల్ఎస్ఎన్ యాజమాన్యం కార్మికులకు పెండింగ్‌లో ఉన్న జూన్, జూలై నెలల వేతనాలను వెంటనే చెల్లించాలని, సుమారు 10 నెలలుగా పెండింగ్‌లో ఉన్న ఈపీఎఫ్ మొత్తాన్ని కార్మికుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేస్తూ సింగరేణి కాలరీస్ కంపెనీ ఇల్లందు జీఎంకు ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో మంగళవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ రాసుద్దిన్, రాష్ట్ర నాయకుడు డి. ప్రసాద్ మాట్లాడుతూ, ఎల్ఎస్ఎన్ యాజమాన్యం కార్మికుల వేతనాల చెల్లింపులో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని ఆరోపించారు. పలుమార్లు వినతిపత్రాలు సమర్పించినా స్పందన లేకపోవడం విచారకరమన్నారు. కార్మికుల జీతాల నుంచి ఈపీఎఫ్ కోత విధిస్తున్నప్పటికీ వారి ఖాతాల్లో జమ చేయడం లేదని, దీనిపై సింగరేణి యాజమాన్యానికి పలుమార్లు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని విమర్శించారు. ఇప్పటికైనా ఎల్ఎస్ఎన్ యాజమాన్యంపై చర్యలు తీసుకుని పెండింగ్ వేతనాలు, ఈపీఎఫ్ బకాయిలను తక్షణమే చెల్లించాలని, లేనిపక్షంలో ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకుడు తోడేటి నాగేశ్వరరావు, సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రీజియన్ అధ్యక్షుడు కొండపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### ఎల్‌నినో ఎఫెక్ట్‌తో

# వరి సాగుకు గండం

- 24%వర్షపాతం లోటు..
- ప్రత్యామ్నాయ పంటలపై వ్యవసాయ శాఖ దృష్టి

కాకతీయ, కొత్తగూడెం ప్రతినిధి : భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఎల్‌నినో ప్రభావంతో వరి సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గే పరిస్థితి నెలకొంది. జిల్లాలో ఇప్పటివరకు 24 శాతం వర్షపాతం లోటు నమోదవగా, భూగర్భ జలాలు 9.3 అడుగుల లోతుకు పడిపోయాయని జిల్లా వ్యవసాయ అధికారి వేల్పుల బాబురావు తెలిపారు. గత ఏడాది 1.70 లక్షల ఎకరాల్లో సాగైన వరి ఈసారి సుమారు 1.15 లక్షల ఎకరాలకే పరిమితమయ్యే అవకాశం ఉందన్నారు. పత్తి సాగు 20 వేల ఎకరాలు పెరగగా, మొక్కజొన్న 28 వేల ఎకరాలు తగ్గిందని వెల్లడించారు. నీటి కొరత నేపథ్యంలో కంది, పెసర, మినుము, జొన్న, కూరగాయలు, ఆయిల్‌పామ్ వంటి ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని రైతులకు సూచిస్తున్నట్లు తెలిపారు. రైతు వేదికల ద్వారా విత్తనాలు అందుబాటులో ఉంచడంతో పాటు అవగాహన కల్పిస్తున్నామని, ఆగస్టు 31 నాటికి జిల్లాలో 6.55 లక్షల ఎకరాల్లో సాగు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.



## బ్లాక్ మనీ పేరుతో రూ.13 లక్షల మోసం

### నిందితుడి అరెస్ట్.. 20 వేల బ్లాక్ పేపర్లు స్వాధీనం



కాకతీయ, కొత్తగూడెం ప్రతినిధి: బ్లాక్ పేపర్లను రసాయనాలతో రూ.500 నోట్లుగా మారుస్తామని నమ్మించి ఓ వ్యక్తి నుంచి రూ.13 లక్షలు కాజేసిన పత్తిపాటి ప్రేమ్‌చంద్ను అశ్వారావుపేట పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా నిందితుడు నేరాన్ని అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. అతని వద్ద నుంచి 20 వేల బ్లాక్ పేపర్లు, రసాయనాల సీసాలను స్వాధీనం చేసుకున్నారు. పాల్వంచ డీఎస్పీ ఆర్. సతీష్ కుమార్ కేసు వివరాలను వెల్లడించారు. నిందితుడిపై గతంలోనూ నకిలీ కరెన్సీ, ద్విచక్ర వాహనాల దొంగతనం కేసులు నమోదైనట్లు పోలీసులు తెలిపారు.

## ఆలయ పనులు గడువులోగా పూర్తి చేయాలి

### భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్



కాకతీయ, కొత్తగూడెం ప్రతినిధి: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో చేపడుతున్న పునర్నిర్మాణ, అభివృద్ధి పనులను వచ్చే ఏడాది గోదావరి పుష్కరాల నాటికి నాణ్యతతో పూర్తి చేయాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. మంగళవారం భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్టతో కలిసి ఆలయ పనులను పరిశీలించిన కలెక్టర్, ఆలయ ప్రాచీనతకు భంగం కలగకుండా భక్తులకు మెరుగైన దర్శన, మౌలిక వసతులు కల్పించేలా పనులు వేగవంతం చేయాలని సూచించారు. పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా సమన్వయంతో పూర్తి చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. తనిఖీల్లో తహసీల్దార్ రవికుమార్, ఆర్అండ్‌బీ ఈఈ నాగేశ్వరరావు, దేవాదాయ శాఖ అధికారులు, ఆర్అండ్‌బీ ఇంజినీర్లు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి : ఎస్పీ రోహిత్ రాజ్

### "సురక్ష కా తిరంగా" పోస్టర్ ఆవిష్కరణ



కాకతీయ, కొత్తగూడెం ప్రతినిధి: సైబర్ నేరాల నివారణకు జిల్లా పోలీసు యంత్రాంగం ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి ప్రజల్లో విస్తృత అవగాహన కల్పిస్తున్నట్లు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు తెలిపారు. మంగళవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో స్వాతంత్ర్య మాసాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న "సురక్ష కా తిరంగా–సైబర్ స్వతంత్ర తెలంగాణ" ప్రచార కార్యక్రమ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఆగస్టు నెల పొడవునా జిల్లావ్యాప్తంగా సైబర్ నేరాల నివారణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ముఖ్యంగా స్టాక్ ఇన్వెస్ట్‌మెంట్, బిజినెస్ ఇన్వెస్ట్‌మెంట్ పేరుతో జరుగుతున్న ఆన్‌లైన్ ఆర్థిక మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. "ఆగు – ఆలోచించు – నిజం నిర్ధారించు" అనే సందేశాన్ని ప్రతి ఒక్కరూ పాటించాలని పిలుపునిచ్చారు. ఈ నెల 5 నుంచి పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులు, మహిళా సంఘాలు, స్వచ్ఛంద సంస్థల్లో సైబర్ భద్రతపై విస్తృత ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. సైబర్ మోసాలకు గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేసి, వెంటనే స్పందించాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ సత్యనారాయణ, సైబర్ సెల్ సీఐ జితేందర్ పాల్గొన్నారు.

### మణుగూరులో ఇసుక లారీలతో

# ట్రాఫిక్ అస్తవ్యస్తం

### రామానుజవారం గుట్టపై గంటల తరబడి వాహనాల నిలిపివేత

### కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని స్థానికుల డిమాండ్



కాకతీయ, కొత్తగూడెం ప్రతినిధి: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులో ఇసుక రవాణాతో రామానుజవారం గుట్ట ప్రాంతంలో తీవ్ర ట్రాఫిక్ సమస్య నెలకొంటోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇసుక ర్యాంపు నుంచి రోజుకు పెద్ద సంఖ్యలో లారీలు రాకపోకలు సాగిస్తుండటంతో ఉదయం నుంచి రాత్రి వరకు వాహనదారులు గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకుంటున్నారని పేర్కొంటున్నారు. సమస్యపై పలుమార్లు ఫిర్యాదు చేసినా శాశ్వత పరిష్కారం లభించలేదని వాపోతున్నారు. ఇసుక కాంట్రాక్టర్‌తో పాటు సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ, ట్రాఫిక్‌కు కారణమవుతున్న పరిస్థితులపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. సమస్య పరిష్కారం కాకపోతే ఇసుక ర్యాంపు వద్ద ఆందోళన చేపడతామని హెచ్చరిస్తున్నారు.

# బోయిని రాజుకు పితృవియోగం

## మాజీ సొసైటీ చైర్మన్ కుటుంబంలో విషాదం

కాకతీయ, చేర్యాల: చేర్యాల మండలం ఆకునూరు గ్రామానికి చెందిన మత్స్య కార్మిక సంఘం మాజీ సొసైటీ చైర్మన్ బోయిని రాజు తండ్రి బోయిని రామస్వామి (81) అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న పలువురు రాజకీయ ప్రముఖులు, ప్రజాప్రతినిధులు బోయిని రాజు కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మంత్రి సీతక్క, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య, జనగామ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బాబు మోహన్ ఫోన్ ద్వారా బోయిని రాజును పరామర్శించి రామస్వామి మృతికి సంతాపం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.అదేవిధంగా స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, వివిధ గ్రామాల ప్రజలు రామస్వామి భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అంతిమయాత్రలో పాల్గొని బోయిని రాజు కుటుంబ సభ్యులను ఓదార్చారు.

# ఉత్తరాఖండ్ మహిళకు రక్షణ.. ఆశ్రమానికి అప్పగింత

కాకతీయ, కరీంనగర్: కరీంనగర్ రూరల్ మండలం ఇరుకుల గ్రామ శివారులో ఒంటరిగా సంచరిస్తున్న ఉత్తరాఖండ్‌కు చెందిన మహిళను కరీంనగర్ రూరల్ పోలీసులు సురక్షితంగా గుర్తించి ఆశ్రయం కల్పించారు. మంగళవారం అర్ధరాత్రి రాజీవ్ రహదారి పక్కన నిర్మాణంలో ఉన్న వంతెన సమీపంలో ఓ మహిళ అనుమానాస్పదంగా సంచరిస్తున్నట్లు సమాచారం అందడంతో ఇన్‌స్పెక్టర్ ఎ. నిరంజన్ రెడ్డి సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకుని ఆమెను తమ ఆధీనంలోకి తీసుకున్నారు. విచారణలో ఆమె ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని ఉదమ్ సింగ్ నగర్ జిల్లా ఖాటిమాకు చెందిన రూపా రాథోర్ (35) గా గుర్తించారు. కుటుంబ కలహాల నేపథ్యంలో భర్తతో గొడవపడి వారం రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయి వివిధ వాహనాల్లో ప్రయాణిస్తూ కరీంనగర్‌కు చేరుకున్నట్లు పోలీసులకు తెలిపింది. అనంతరం బస్టాండ్‌లో బస్సు ఎక్కగా టికెట్‌కు డబ్బులు లేకపోవడంతో ఇరుకుల గ్రామ సమీపంలో దింపివేసినట్లు వెల్లడించింది. మహిళ ఇచ్చిన వివరాల ఆధారంగా కుటుంబ సభ్యులను సంప్రదించగా, ఆమె కనిపించకపోవడంతో ఉత్తరాఖండ్‌లో ఇప్పటికే మిస్సింగ్ కేసు నమోదైనట్లు తెలిసింది. ఆమెను తీసుకెళ్లేందుకు కుటుంబ సభ్యులు కరీంనగర్‌కు బయలుదేరినట్లు పోలీసులకు సమాచారం అందింది. ప్పటి వరకు మహిళను కరీంనగర్ శక్తి కేంద్రంలో సురక్షితంగా ఉంచినట్లు పోలీసులు తెలిపారు. కుటుంబ సభ్యులు లేదా ఉత్తరాఖండ్ పోలీసులు వచ్చిన అనంతరం చట్టపరమైన ప్రక్రియ పూర్తి చేసి మహిళను అప్పగిస్తామని ఇన్‌స్పెక్టర్ ఎ. నిరంజన్ రెడ్డి తెలిపారు.

# అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



కాకతీయ, చేర్యాల : అప్పుల భారాన్ని తట్టుకోలేక ఓ యువ రైతు ఆత్మహత్యకు పాల్పడిన విషాద ఘటన చేర్యాల మండలం కొత్త దొమ్మా ట గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన శెట్టె రామస్వామి (38) చేర్యాల పెద్ద చెరువులో దూకి ప్రాణాలు తీసుకున్నాడు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. వ్యవసాయ అవసరాల కోసం ఆవుల షెడ్డు నిర్మాణం, బోర్లు వేయడం తదితర పనులకు రామస్వామి అప్పులు చేశాడు. వాటిని తీర్చలేక తీవ్ర మనస్తాపానికి గురైన ఆయన సోమవారం సాయంత్రం ద్విచక్ర వాహనంపై ఇంటి నుంచి వెళ్లి చెరువులో దూకినట్లు తెలిపారు. మంగళవారం పోలీసులు, స్థానిక యువకుల సహాయంతో మృతదేహాన్ని చెరువులో నుంచి వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. భార్య శెట్టె లలిత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రామస్వామికి తల్లి, భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఇప్పటికే తండ్రి, సోదరుడిని కోల్పోయిన కుటుంబానికి ఆయనే పెద్దదిక్కుగా ఉండగా, ఇప్పుడు ఆయన మృతితో కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

# ఓలా–ఉబర్ సేవలతో ఉపాధి సంక్షోభం

- కలెక్టరేట్ ఎదుట ఆటో డ్రైవర్ల వినూత్న భిక్షాటన
- సంప్రదాయ ఆటో కార్మికులకు రక్షణ కల్పించాలని డిమాండ్




కాకతీయ, కరీంనగర్: ఓలా–ఉబర్ తరహా ఆటో, బైక్ టాక్సీ సేవల వల్ల సంప్రదాయ ఆటో డ్రైవర్ల ఉపాధి తీవ్ర సంక్షోభంలో పడిందని ఆరోపిస్తూ కరీంనగర్ జిల్లా ఆటో డ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట ఆటో కార్మికులు వినూత్నంగా భిక్షాటన నిర్వహించి నిరసన తెలిపారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని ఆటో కార్మికుల జీవనోపాధిని కాపాడాలని డిమాండ్ చేశారు. యూనియన్ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ మహాలక్ష్మి పథకం అమలుతో ఇప్పటికే ఆటో డ్రైవర్ల ఆదాయం తగ్గిపోయిందని, ఇప్పుడు ఓలా–ఉబర్ సేవలు విస్తరించడంతో పూర్తిస్థాయిలో ఉపాధి కోల్పోయే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆటో కార్మికులను ఆదుకుంటామని ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఇప్పటివరకు అమలు కాలేదని విమర్శించారు. జిల్లాలో ఓలా–ఉబర్ తరహా సేవలను నియంత్రిస్తూ సంప్రదాయ ఆటో డ్రైవర్లకు రక్షణ కల్పించే ప్రత్యేక విధానాన్ని రూపొందించాలని, ఆటో కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేక పథకాలు అమలు చేసి ఉపాధి భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. డిమాండ్లను ప్రభుత్వం పట్టించుకోకపోతే రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, స్థానిక ఎమ్మెల్యే కార్యాలయాలను ముట్టడిస్తూ ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నిరసన అనంతరం ఆటో కార్మికులు ప్రతీకాత్మకంగా భిక్షాటన నిర్వహించి తమ కుటుంబాల జీవనాధారాన్ని కాపాడాలని, సమస్యలను ప్రభుత్వం అత్యవసరంగా పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

# పీఎం శ్రీతో ప్రభుత్వ బడులకు కొత్త రూపు




**కరీంనగర్ జిల్లాలో 22 పాఠశాలలకు ఆధునిక వసతులు**

**ఏఐ హబ్‌గా ఒక ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి**

కాకతీయ, కరీంనగర్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం శ్రీ పథకం కింద కరీంనగర్ జిల్లాలో ఎంపికైన 22 ప్రభుత్వ పాఠశాలలకు ఆధునిక సౌకర్యాలు కల్పించేందుకు నిధులు మంజూరయ్యాయి. ఒక్కో పాఠశాలకు సుమారు రూ.9.75 లక్షలు కేటాయించగా, ఈ నిధులతో విద్యార్థులకు అత్యాధునిక విద్యా వాతావరణం కల్పించేందుకు చర్యలు చేపట్టనున్నారు. ఈ నిధులతో సైన్స్, గణితం, కంప్యూటర్ ప్రయోగశాలలు, స్మార్ట్ క్లాస్‌రూమ్‌లు, డిజిటల్ బోధనా పరికరాలు, ప్రొజెక్టర్లు, ఇంటరాక్టివ్ బోర్డులు తదితర ఆధునిక సదుపాయాలను ఏర్పాటు చేయనున్నారు. సాంకేతిక ఆధారిత బోధనకు ప్రాధాన్యం ఇస్తూ విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించేలా విద్యా వ్యవస్థను ఆధునికీకరించనున్నారు.

**ఏఐ హబ్‌గా ప్రత్యేక పాఠశాల**

జిల్లాలోని ఒక ప్రభుత్వ పాఠశాలను కృత్రిమ మేధస్సు (ఏఐ) హబ్‌గా అభివృద్ధి చేయనున్నారు. ఇందుకోసం ప్రత్యేక పరికరాలు, సాఫ్ట్‌వేర్, శిక్షణా కార్యక్రమాలను అందుబాటులోకి తీసుకురానున్నారు. చిన్న వయస్సు నుంచే విద్యార్థులకు ఏఐ, సాంకేతిక విజ్ఞానంపై అవగాహన కల్పించేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టనున్నారు.మౌలిక వసతులు, ఆధునిక బోధనా విధానాలతో ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా నిలుస్తున్నాయని విద్యాశాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. నాణ్యమైన బోధన, ఆధునిక సదుపాయాల కారణంగా ప్రభుత్వ బడులపై తల్లిదండ్రుల విశ్వాసం పెరుగుతుండగా, ప్రతి ఏడాది విద్యార్థుల చేరికలు కూడా క్రమంగా పెరుగుతున్నాయని అధికారులు వెల్లడిస్తున్నారు. పీఎం శ్రీ పథకం అమలుతో ప్రభుత్వ పాఠశాలల్లో మరింత నాణ్యమైన విద్యా వాతావరణం ఏర్పడి, భవిష్యత్ అవసరాలకు అనుగుణమైన సాంకేతిక నైపుణ్యాలు విద్యార్థులకు అందుబాటులోకి రానున్నాయని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.

# మానేరు నీటిమట్టంపై అధికారుల నిఘా

**మరో మూడు రోజుల్లో మత్తడి దూకే అవకాశం**

**పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: తహసీల్దార్ మారుతి రెడ్డి**



కాకతీయ, గంభీరావుపేట : మండలంలోని ఎగువ మానేరు జలాశయాన్ని గంభీరావుపేట తహసీల్దార్ మారుతిరెడ్డి మంగళవారం ఇరిగేషన్ శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. పరివాహక ప్రాంతంలో కురుస్తున్న వర్షాలు, జలాశయంలోకి వస్తున్న వరద ప్రవాహాన్ని ఆయన సమీక్షించారు. ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురవడంతో ఎగువ మానేరులోకి గణనీయంగా వరద నీరు చేరుతోందని తహసీల్దార్ తెలిపారు. దీంతో జలాశయంలో నీటిమట్టం క్రమంగా పెరుగుతోందని, ఇదే పరిస్థితి కొనసాగితే రానున్న మూడు రోజుల్లో మత్తడి దూకే అవకాశం ఉందన్నారు. పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, గ్రామపంచాయతీ కార్యదర్శులు అందుబాటులో ఉంటూ పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ పర్యటనలో ఇరిగేషన్ శాఖ ఈఈ ప్రశాంత్, డీఈ నర్సింగ్, ట్రెయినీ డిప్యూటీ కలెక్టర్ నికిత పాల్గొన్నారు.

# రుద్రంగిలో రూ.45 కోట్ల ఏటీసీకి శ్రీకారం



- మంత్రి వివేక్ వెంకటస్వామి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ భూమిపూజ
- జర్మనీ, జపాన్ ఉద్యోగాలకు ప్రత్యేక శిక్షణ
- రూ.40 లక్షల సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

కాకతీయ, రుద్రంగి : రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగిలో రూ.45 కోట్ల వ్యయంతో నిర్మించనున్న అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌కు కార్మిక, ఉపాధి శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మంగళవారం భూమిపూజ చేశారు. అనంతరం రూ.40 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా రూ.4 వేల కోట్లతో 65 అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రెండున్నరేళ్లలో లక్ష ఉద్యోగాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఏటీసీల్లో శిక్షణ పొందే విద్యార్థులకు నెలకు రూ.2 వేల స్టైపెండ్ అందించడంతో పాటు కృత్రిమ మేధ, డ్రోన్ టెక్నాలజీ వంటి ఆధునిక కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. జర్మనీ, జపాన్ వంటి దేశాల్లో ఉద్యోగాల కోసం విదేశీ భాషల శిక్షణ కూడా అందిస్తామని, రుద్రంగికి ప్రత్యేకంగా జర్మన్ భాష శిక్షకుడిని నియమించి 100 మంది యువతకు విదేశీ ఉద్యోగ అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రుద్రంగి ఏటీసీలో 288 మంది యువతకు 7 ఆధునిక కోర్సుల్లో శిక్షణ అందుతుందని తెలిపారు. మూడపల్లిలో రూ.200 కోట్లతో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ద్వారా 2,500 మంది విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా రూపొందించిన కోర్సులు యువతకు నేరుగా ఉపాధి అవకాశాలు కల్పిస్తాయని, ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకుల తిరుపతి, ఆత్మ కమిటీ డివిజన్ చైర్మన్ ముకుంద రెడ్డి, ఆర్డీఓ కే ఎస్ బీ కుమారి, డీఎస్పీ శ్రీనివాసులు, మండల ప్రత్యేక అధికారి శ్రీనివాసాచారి, ఈఈ పీఆర్ సుదర్శన్ రెడ్డి, మైనింగ్ శాఖ ఏడీ క్రాంతి, తహసీల్దార్ పుష్పలత, ఎంపీడీఓ నటరాజ్, సర్పంచ్ గండి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# పట్టు పురుగుల పెంపకం లాభదాయకం

- సబ్సిడీతో మల్బరీ మొక్కలు, పరికరాలు
- కలెక్టర్ గరిమ అగ్రవాల్



కాకతీయ, చందుర్తి : పట్టు పురుగుల పెంపకం రైతులకు అదనపు ఆదాయం అందించే లాభదాయకమైన ప్రత్యామ్నాయ వ్యవసాయ విధానమని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అన్నారు. మంగళవారం చందుర్తి మండలం మల్యాల గ్రామంలో రైతులు కల్లెడ శైలేష్, కల్లెడ లక్ష్మణ్ రెండు ఎకరాల్లో సాగు చేస్తున్న మల్బరీ తోట, పట్టు పురుగుల పెంపకం కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. మల్బరీ మొక్కల సాగు, నిర్వహణ, పట్టు పురుగుల పెంపక విధానంపై రైతులను అడిగి తెలుసుకున్న కలెక్టర్, ప్రభుత్వం సెరికల్చర్ శాఖ ద్వారా మల్బరీ సాగు, షెడ్ల నిర్మాణం, పరికరాల కొనుగోలుకు సబ్సిడీ అందిస్తోందని తెలిపారు. పట్టు పురుగుల పెంపకంలో కేవలం 25 రోజుల్లోనే ఆదాయం పొందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. సంప్రదాయ పంటలకు ప్రత్యామ్నాయంగా ఈ రంగంపై రైతులు దృష్టి సారించి ప్రభుత్వ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శరత్ బాబు, పట్టు పురుగుల శాఖ అధికారి జగన్, తహసీల్దార్ భూపతి తదితరులు పాల్గొన్నారు.

# హుజూరాబాద్‌లో బీజేపీకి ఎదురుదెబ్బ

**కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన ముగ్గురు సర్పంచ్‌లు**

**ఇల్లంతకుంట మండలంలో రాజకీయ సమీకరణాలపై చర్చ**



కాకతీయ, కరీంనగర్ / హుజూరాబాద్ : హుజూరాబాద్ నియోజకవర్గంలోని ఇల్లంతకుంట మండలంలో బీజేపీకి ఎదురుదెబ్బ తగిలింది. మండలానికి చెందిన సిరిసేడు సర్పంచ్ కుమార్–శ్యామల, వంతడుపుల సర్పంచ్ రాజేష్–మాధవి, టేకుర్తి సర్పంచ్ శ్రీనివాస్ బీఆర్ఎస్‌లో చేరారు. హైదరాబాద్‌లోని నందినగర్‌లో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, మాజీ మంత్రి గంగుల కమలాకర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా చేరిన సర్పంచ్‌లు మాట్లాడుతూ, కేసీఆర్ నాయకత్వంలో అమలైన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రజల్లో ఇప్పటికీ విశ్వాసం ఉందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీల అమలులో విఫలమైందని విమర్శిస్తూ, బీజేపీ కూడా ప్రజా సమస్యల కంటే రాజకీయాలకే ప్రాధాన్యం ఇస్తోందని ఆరోపించారు. గ్రామీణ ప్రాంతాల్లో కాంగ్రెస్, బీజేపీలపై ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని, అందువల్ల పలువురు ప్రజాప్రతినిధులు బీఆర్ఎస్ వైపు మొగ్గు చూపుతున్నారని తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని చేరికలు ఉంటాయని వెల్లడించారు. హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నందున ఆయన నాయకత్వంపై విశ్వాసంతోనే బీఆర్ఎస్‌లో చేరినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, మాజీ ఎంపీపీ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# పోతరాజుల విన్యాసాలతో ఆకట్టుకున్న విద్యార్థులు



కాకతీయ, చందుర్తి: రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం లింగంపేటలోని మహోదయ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో మంగళవారం పోచమ్మ బోనాల వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ ఏనుగుల కృష్ణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు పోతరాజులు, అమ్మవారి వేషధారణలో విన్యాసాలు ప్రదర్శించారు. పాఠశాల నుంచి పోచమ్మ దేవాలయం వరకు నిర్వహించిన ర్యాలీ భక్తి వాతావరణాన్ని నెలకొల్పింది. అనంతరం అమ్మవారికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఏనుగుల రేణుక, మెంగళి కవిత, కముటం స్వప్న, మున్నీరా, ఇందూరి సౌమ్యతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

# వరద ఉధృతిపై అప్రమత్తంగా ఉండాలి

- ఎగువ మానేరు మత్తడి దూకే అవకాశం
- రైతులు, ప్రజలకు తహసీల్దార్ మారుతి రెడ్డి హెచ్చరిక

కాకతీయ, గంభీరావుపేట : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ఎగువ మానేరు పరివాహక ప్రాంతంలో వరద ప్రవాహం పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గంభీరావుపేట తహసీల్దార్ మారుతి రెడ్డి సూచించారు. ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాల కారణంగా ఎగువ మానేరు మత్తడి పైనుంచి నీరు ప్రవహించే అవకాశం ఉందని మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. వరద ప్రభావం దృష్ట్యా రైతులు పశువులను మేత కోసం నది అవతలి గట్టుకు తీసుకెళ్లడం, అక్కడే కట్టివేయడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అవసరమైతే మాత్రమే బయటకు రావాలని, ప్రమాదకర ప్రాంతాలకు వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రజలను అప్రమత్తం చేయాలని అన్ని గ్రామపంచాయతీ కార్యదర్శులకు తహసీల్దార్ మారుతి రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. వరదపరిస్థితుల నేపథ్యంలో అధికారులు ప్రజలు అప్రమత్తంగా ఉండి యంత్రాంగానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# బండపల్లి–ఎన్గల్ రోడ్డుపై చెట్ల కొమ్మల తొలగింపు

కాకతీయ, చందుర్తి: రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం బండపల్లి–ఎన్గల్ గ్రామాల మధ్య ఇటీవల జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం నేపథ్యంలో పోలీసులు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టారు. మలుపుల వద్ద వాహనదారులకు ఎదురుగా కనిపించకుండా అడ్డుగా పెరిగిన చెట్ల కొమ్మలను, రోడ్డుకు ఇరువైపులా ప్రమాదకరంగా విస్తరించిన కొమ్మలను తొలగించి దృశ్యమానతను మెరుగుపరిచారు. ఇటీవల ఇదే మార్గంలో జరిగిన ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, ఇద్దరు తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఈ పనులు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. చెట్ల కొమ్మల తొలగింపులో పోలీసు సిబ్బంది సతీష్, ప్రమోద్తో పాటు గ్రామస్తులు శ్రమదానం చేశారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ అప్రమత్తంగా ప్రయాణించాలని పోలీసులు సూచించారు.

# స్కై స్కూల్‌లో బోనాల సందడి




కాకతీయ, సిరిసిల్ల టౌన్ : వేములవాడ పట్టణంలోని సాయినగర్‌లో గల స్కై స్కూల్లో మంగళవారం తెలంగాణ బోనాల వేడుకలను వైభవంగా నిర్వహించారు. విద్యార్థులు పోతురాజుల వేషధారణలో విన్యాసాలు ప్రదర్శించగా, విద్యార్థినులు అమ్మవారి వేషధారణలో సంప్రదాయ నృత్యాలతో ఆకట్టుకున్నారు. అనంతరం తెలంగాణ చౌక్‌లో నిర్వహించిన బోనాల ప్రదర్శన స్థానికులను అలరించింది. ఈ సందర్భంగా వేములవాడ బద్ది పోచమ్మ అమ్మవారికి బోనం సమర్పించి రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి పాడిపంటలు బాగా పండాలని ప్రార్థించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను విద్యార్థులకు పరిచయం చేయడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని పాఠశాల కరస్పాండెంట్ మహేష్ ఆసారి తెలిపారు. కార్యక్రమంలో ఇంచార్జి ప్రిన్సిపల్ జమున, ఉపాధ్యాయులు తులసిరామ్, శైలజ, స్రవంతి, దివ్య, మమత, చంద్రకళ, హర్షిత, సౌందర్య, త్రివేణి, అంజలి, మౌనిక, కావేరి, పాఠశాల ఇంచార్జి జక్కుల మహేష్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.